


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 16 సెప్టెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 39 పేజీలు : 4 వెల : రూ


## సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీఎన్జీఓలు

**పీఆర్సీ విషయమై ఆరా**
**సానుకూలంగా స్పందించారన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు**



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ ఎన్జీవోలు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు నేతృత్వంలో ఓ బృందం తాడేపల్లిలో సీఎం జగన్‌ను కలిసి పీఆర్సీ విషయమై చర్చించారు. పీఆర్సీ నివేదిక ఇచ్చి చాలా రోజులు అవుతోందని, జాప్యం లేకుండా పీఆర్సీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తెలంగాణలో ఉద్యోగులకు పీఆర్సీ ఇచ్చారని గుర్తుచేశారు. ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించి త్వరలోనే పీఆర్సీ ప్రకటిస్తామని సీఎం చెప్పినట్లు ఎన్జీఓ నాయకులు తెలిపారు. ముందు పీఆర్సీ ఇస్తామన్నారు.. తరవాత డీఏలు ఇస్తామన్నారు.. సీపీఎస్ రద్దు పై ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటామని చెప్పినట్లు వెల్లడించారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు శాఖపరమైన పరీక్షలతో సంబంధం లేకుండా ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరినట్లు మీడియాతో బండి శ్రీనివాస రావు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారని, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## చంద్రబాబు వల్లే 'ఏ' గ్రేడ్ సంఘాలన్నీ 'సి' గ్రేడ్‌లోకి పడిపోయాయి: సీఎం జగన్



తాడేపల్లి: 'గత ప్రభుత్వం మాఫీ చేస్తానని హామీ ఇచ్చి రుణాలు కట్టొద్దని పిలుపునిచ్చి మోసం చేసింది. ఈ నేపథ్యంలో ఆ రుణాలను అక్కాచెల్లెమ్మలు చెల్లించలేదు. చివరకు వడ్డీలు కూడా చెల్లించలేక తడిసి మోపెడై అక్కాచెల్లెమ్మల పరిస్థితి దారుణంగా మారింది. ఈ నేపథ్యంలో కట్టలేని ఆ రుణాలను నాలుగు దఫాలుగా ప్రభుత్వమే చెల్లిస్తోంది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 2016లో రద్దయిన సున్నావడ్డీ రుణాలను మళ్లీ తిరిగి పునరుజ్జీవింపచేసి, మహిళలను ఆదుకోవడమే కాకుండా వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేట్టుగా ఐటీసీ, రిలయన్స్, అమూల్‌లాంటి దిగ్గజ కంపెనీలను భాగస్వాములను చేసి, వారికి వ్యాపార మార్గాలను చూపించింది. ఆసరా, చేయూత, సున్నా వడ్డీ రుణాల వంటి పథకాలతో నిజమైన మహిళా సాధికారితకు, ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం దారులు వేస్తోంది' అని తెలిపారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మొదటి విడత ఆసరా కింద దాదాపు 8 లక్షల పైచిలుకు డ్వాక్రా గ్రూపులకు రూ. 6330.58 కోట్లు మహిళలకు ప్రభుత్వం అందించిందని వివరించారు. దాంతోపాటు రెండో విడత ఆసరా సన్నాహకాలను అధికారులు వివరించారు. లబ్ధిదారుల జాబితాపై సామాజిక తనిఖీ పూర్తయిందని, గ్రామ సచివాలయాల్లో కూడా ఆ జాబితాలను ప్రదర్శించామని సీఎం జగన్‌కు అధికారులు చెప్పారు. ఆసరా,

**వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలపై సీఎం జగన్ సమీక్ష**

చేయూతల కింద మహిళల్లో సుస్థిర ఆర్థిక ప్రగతి కోసం చేపడుతున్న ఉపాధి మార్గాలు, వాటి అమలు కార్యక్రమాలను సీఎం సమగ్రంగా సమీక్షించారు. 2014లో చంద్రబాబు అక్కాచెల్లెమ్మల రుణాలను మాఫీచేసి ఉండిఉంటే అక్కడితో భారం పోయేది. కానీ చంద్రబాబు హామీ ఇచ్చి వాటిని కట్టకపోవడంతో మహిళలపై ఆ భారం అమాంతంగా పడింది. మహిళలను ఆదుకోకపోవడంతో మొత్తం వ్యవస్థ ఛిన్నాభిన్నమయ్యింది. చంద్రబాబు వల్లే ఏ గ్రేడ్‌లో ఉన్న సంఘాలన్నీ కూడా 'సి' గ్రేడ్‌లోకి పడిపోయాయి. పాదయాత్రలో నేను వెళ్లినప్పుడు ప్రతి మహిళా చేసిన డిమాండ్ .. డ్వాక్రా రుణాల మాఫీ. మా పరిస్థితి బాగోలేదని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆసరా, చేయూతలను తీసుకువచ్చాం. మహిళల్లో స్థిరమైన ఆర్థిక అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను మళ్లీ ఒకసారి సమీక్షించి మరింతమందికి లబ్ధి చేకూర్చేలా కార్యక్రమాలను చేపట్టాలి. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో అవగాహన, చైతన్యం కల్పించాలి. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక భరోసా.. వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు ఉపయోగపడాలి. రెండో విడత ఆసరాను ఉంచుకుని ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలి. ప్రజాప్రతినిధులను కూడా ఇందులో పాల్గొనేలా కార్యక్రమాలను రూపొందించాలి' అని సీఎం జగన్ అధికారులకు ఆదేశించారు. 'ఆసరా కింద ఇచ్చే డబ్బును బ్యాంకులు జమచేసుకోలేని విధంగా అన్ ఇంకబర్డ్ ఖాతాల్లో జమచేయాలి. స్థిర ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ఉపాధి మార్గాల కోసం బ్యాంకులు రుణాలు ఇప్పించేలా స్పాట్ డాక్యుమెంటేషన్ జరిగేలా చూడాలి. ఇళ్ల లబ్ధిదారులైన అక్కాచెల్లెమ్మలకు రూ. 35 వేల చొప్పున పావలా వడ్డీకి రుణం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి' అని సీఎం జగన్ తెలిపారు. అనంతరం వైఎస్సార్ చేయూతపైన ఆయన సమీక్షించారు. చేయూతపై సీఎంకు అధికారులు వివరాలు అందించారు. వైఎస్సార్ చేయూత మొదటి విడత ద్వారా దాదాపు 3 లక్షల మంది మహిళలకు సుస్థిర ఆర్థిక ప్రగతి కోసం ఉపాధి మార్గాలు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. రిటైల్ షాపులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పెంపకం తదితర ఉపాధి మార్గాలను కల్పించినట్లు వెల్లడించారు. రెండో విడతలో 2,21,598 మంది మహిళలకు ఉపాధి మార్గాల కల్పనకు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. మహిళలు చేస్తున్న వ్యాపారాలకు సంబంధించి మార్కెటింగ్ సమస్య ఉత్పన్నం కావొద్దని ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మనం ఎలాంటి ఉపాధిమార్గం చూపినా మహిళలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గతేడాది ప్రాక్టర్ అండ్ గాంబిల్, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, రిలయన్స్ రిటైల్, అమూల్, అల్లానాలతో కలిసి సుస్థిర ఆర్థిక ప్రగతి కార్యక్రమాలు చేపట్టినట్లు సీఎం జగన్‌కు వివరించారు. ఈ ఏడాది రిలయన్స్‌కు చెందిన అజియో, టనాజెర్, గ్రామీణ వికాస్ కేంద్ర, మహీంద్రా, గెయిన్, కల్‌గుడి కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు చెప్పారు. ఆసరా, చేయూత కింద మనం ఇచ్చే డబ్బును మహిళలు సుస్థిర జీవనోపాధికి వినియోగించుకోవాలన్నదే ప్రధాన ఉద్దేశమని సీఎం జగన్ స్పష్టం చేశారు. సుస్థిర జీవనోపాధి మార్గాలతో విజయవంతమైన మహిళల ద్వారా ఇతర మహిళలు స్ఫూర్తి పొందాలని సూచించారు. వారు చేస్తున్న వ్యాపార కార్యకలాపాలు, పశుపోషణ ద్వారా పొందుతున్న ఆదాయాల వివరాలను ఇతర మహిళలకు వివరించాలని అధికారులకు సీఎం నిర్దేశించారు. సమావేశానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ, సెర్ప్ సీఈఓ ఎండీ ఇంతియాజ్, మెప్మా ఎండీ విజయలక్ష్మి, స్త్రీనిధి ఎండీ నాంచారయ్య, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ ఆర్ అమరేంద్ర కుమార్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ మహిత తదితరులు హాజరయ్యారు.

## సంక్షేమ పాలనను పక్కదోవ పట్టించేందుకే కేసులు: సజ్జల

**రఘురామకృష్ణంరాజు కేసులో విషయం లేదు**
**చివరకు న్యాయమే గెలిచింది: సజ్జల**



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనను పక్కదోవ పట్టించేందుకే రఘురామకృష్ణంరాజు కేసులు వేశారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. ఇలాంటి దురుద్దేశపూరితమైన కేసులను కోర్టులు కూడా స్వీకరించకూడదని అన్నారు. సుప్రీంకోర్టు కూడా పిల్‌లు దుర్వినియోగం కాకుండా చూడాలని సూచించిందని గుర్తుచేశారు. ఈ కేసును అడ్డు పెట్టుకుని వాళ్లు చేసిన విషప్రచారం అంతాఇంతా కాదని పేర్కొన్నారు. ఎల్లో మీడియా అసంబద్ధమైన చర్చలు పెట్టిందని సజ్జల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వారి పైత్యం పతాక స్థాయికి చేరింది.. చివరకు న్యాయమే గెలిచింది' అని ఆయన బుధవారం నాటి మీడియా సమావేశంలో చెప్పుకొచ్చారు. ఇలాంటి దుష్ప్రచారాలపై కోర్టులు కూడా దృష్టి సారించాలని సజ్జల విజ్ఞప్తి చేశారు. దురుద్దేశపూరితమైన ప్రచారాలను సూమోటోగా తీసుకోవాలని కోరారు.

## ఏపీ సంస్కృతిని ప్రతిబింబించేలా 'లేపాక్షి' ఉత్పత్తులు

**మంత్రి గౌతమ్‌రెడ్డి వెల్లడి**
**లేపాక్షి హస్తకళలపై సమీక్ష**

అమరావతి: లేపాక్షికి సంబంధించి ఒక బ్రాండ్ అంబాసిడర్ ఏర్పాటు చేస్తామని చేనేత,జౌళి శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి తెలిపారు. ఆయన అధ్యక్షతన బుధవారం చేనేత, జౌళి శాఖపై మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యుత్తమ హ్యాండ్లూమ్ క్లస్టర్‌ల ఫొటోలు, అత్యుత్తమంగా ఉండడానికి గల కారణాలపై తర్వాతి సమావేశానికి సమగ్ర వివరాలు అందించాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. పవర్ లూమ్ యూనిట్లకు అందించే పవర్ టారిఫ్ వివరాలు, ముద్ర రుణాలను మంత్రి గౌతమ్‌రెడ్డి ఆరా తీశారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌తో విక్రయాలను మరింత పెంచాలని సూచించారు. ఈ-కామర్స్ ద్వారా వచ్చే ఆర్డర్లను మూడు రోజుల్లో డెలివరీ చేసే స్థాయికి చేరాలని స్పష్టం చేశారు. ఖాదీ ప్రోగ్రామ్, ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎమ్ఈజీపీ), ఎంటర్‌ప్యూనర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈడీపీ)లపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 17 షోరూంలు (ఏపీయేతరవి 3) కోవిడ్ కారణంగా కొంత ఇబ్బంది కలిగినా స్వయంగా నడపగలిగినవే అన్నీ అని వివరించారు. తోలుబొమ్మలు, ఆదివాసీ పెయింటింగ్స్, ఏటికొప్పాక, కొండపల్లి, బంజారా ఎంబ్రాయిడరీ వస్తువుల తయారీలో మరింత శిక్షణనందిస్తే నాణ్యత ప్రమాణాలు పెరుగుతాయని మంత్రి చెప్పారు. ఎక్కువ నాణ్యత, రకరకాల డిజైన్ల తయారీతో ఎక్కువ మందిని ఆకర్షించేలా ఉండాలని పేర్కొన్నారు. ఒక జిల్లా ఒక వస్తువు విషయంలో మరింత చొరవ పెరగాలని తెలిపారు. తిరుపతి బాలాజీ, పుట్టపర్తి సాయిబాబా వంటి దేవుడి విగ్రహాల తయారీలో నైపుణ్యం పెంచి.. ఎక్కువ ప్రతిమల తయారీపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి ప్రతిబింబించేలా బ్రాండింగ్, బ్రాండ్ అంబాసిడర్ ఉంటుందని మంత్రి గౌతమ్‌రెడ్డి చెప్పారు. సమావేశంలో ఆప్కో చైర్మన్ చల్లపల్లి మోహన్ రావు, హస్తకళల అభివృద్ధి సంస్థ (ఏపీహెచ్డీసీఎల్) ఛైర్మన్ బండిగింజల విజయలక్ష్మి, చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్, జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## జగన్ సర్కార్ పై జీవీఎల్ సెటైర్లు

విజయవాడ, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఏపీ సర్కార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో గత రెండున్నరేళ్లలో అభివృద్ధి అనేదే కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. బుధవారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. అప్పులేనిదే పూట గడవని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. అప్పుల ఊబి నుంచి బయటపడేందుకు ఏదైనా ఆలోచన చేస్తుందా? అంటే అదీ లేదని ఎద్దేవా చేశారు. ప్రజలపై భారం మాత్రమే వేస్తుందంటూ దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను నీరుగార్చే విధంగా ఏవేవో ఆదేశాలిస్తోందని విమర్శలు గుప్పించారు. పాలనా పరంగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కేంద్రం చెపట్టేవి తప్ప రాష్ట్ర ప్రభుత్వం రూపాయి కూడా ప్రత్యేకంగా ఖర్చు పెట్టింది లేదని జీవీఎల్ విమర్శించారు. విజయవాడ ? బెంగళూరు హై వే నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వమే చేపడుతోందన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి కొత్త లైన్ ప్రారంభమైందని, ఇంకా ముందుకు వెళ్లాల్సిన పరిస్థితిలో రాష్ట్రం ప్రభుత్వం తామిప్పుడు డబ్బులు ఇవ్వలేమంటోందన్నారు. 8 లక్షల 16 వేల కోట్ల రూపాయిలతో ఏపీ లో మౌళిక వసతుల కల్పనకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసిందని జీవీఎల్ తెలిపారు. అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాగా డబ్బులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలా కాకుండా ఓటింగ్ కే పరిమితమైతే అదే మిగులుతుందని వ్యాఖ్యానించారు. ఇక రివర్స్ టెండరింగ్ అంశంపైనా జీవీఎల్ విమర్శలు గుప్పించారు. రివర్స్ రెండరింగ్ అని మొదలు పెట్టారు కానీ రాష్ట్రంలో రివర్స్ అభివృద్ధి జరుగుతుందని ఎద్దేవా చేశారు. రివర్స్ టెండరింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం దూరాలోచన అని భావిస్తుందని, అయితే తాము మాత్రం దురాలోచన అనుకుంటున్నామని జీవీఎల్ వ్యాఖ్యానించారు. ఇకపోతే సినిమా టికెట్ రేట్ల వివాదంపైనా జీవీఎల్ విమర్శలు గుప్పించారు. సినిమా టికెట్స్ అమ్మకాలను ప్రభుత్వమే చేపట్టి.. రాబోయే ఏడాదికి రిలీజ్ కాబోయే సినిమాలు ఇవే అని చూపుతూ కొత్తగా రుణాలు తెద్దామనుకుంటున్నారేమో అని దుయ్యబట్టారు. సినిమా టిక్కెట్లను తామే అమ్ముతామంటున్న ప్రభుత్వం.. రేపు సినిమాలు కూడా మేమే తీస్తామంటారేమో అని విమర్శించారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేశామని జీవీఎల్ నరసింహారావు తెలిపారు. కేంద్రంలోని పెద్దలను, రైల్వే బోర్డు ఛైర్మన్ సునీల్ శర్మను కలిసి విశాఖ రైల్వే జోన్‌ని ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని కోరామన్నారు. ఇక స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వానిది విధానపరమైన నిర్ణయం అన్నారు. నిధుల సేకరణ మాత్రమే కాదని, మానుఫ్యాక్షరింగ్ రంగాన్ని బలోపేతం చేయాలనే చూస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయములో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం సరైందే అని ప్రజలు అభిప్రాయపడుతున్నారని జీవీఎల్ పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దేనికి ఖర్చు పెడుతుందో తెలియదన్నారు. అవి బయటపెడితే మిగతా నిధులను కేంద్రం ఇస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. అప్పుతెచ్చుకోవడం, అరువు తెచ్చుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌డీ చేసిందని సెటైర్లు వేశారు.





## తయారీ రంగం సత్తా పెంచేందుకు కేంద్రం ప్రోత్సాహకాలు

న్యూఢిల్లీ : భారత దేశంలో ఆటోమొబైల్, డ్రోన్ తయారీ రంగం సామర్థ్యం మరింత పెరిగేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఆటోమొబైల్, డ్రోన్ పరిశ్రమల కోసం ఉత్పత్తి అనుబంధ ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాన్ని ఆమోదించింది. పీఎల్ఐ ఆటో స్కీమ్ వల్ల మన దేశంలో అడ్వాన్స్‌డ్ ఆటోమోటివ్ టెక్నాలజీస్ గ్లోబల్ సప్లయ్ చైన్‌కు మార్గం సుగమం అవుతుంది. అంతేకాకుండా దాదాపు 7.6 లక్షల మందికి అదనంగా ఉపాధి లభిస్తుంది. ఈ పథకంలో భాగంగా రూ. 26,058 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను ఐదేళ్లలో ఈ పరిశ్రమలకు అందజేస్తారు. ఐదేళ్ళలో రూ. 42,500 కోట్లు కొత్త పెట్టుబడులు వస్తాయని అంచనా. రూ. 2.3 లక్షల కోట్లకుపైగా విలువైన ఉత్పత్తులు పెరుగుతాయని భావిస్తున్నారు. డ్రోన్ల కోసం ప్రకటించిన పీఎల్ఐ స్కీమ్ వల్ల మూడేళ్ళలో కొత్తగా రూ. 5,000 కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. రూ. 1,500 కోట్ల విలువైన ఉత్పత్తులు పెరుగుతాయని అంచనా. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి గొప్ప ఊపునిచ్చే విధంగా ఆటోమోటివ్ రంగానికి పీఎల్ఐ స్కీమ్‌ను ప్రభుత్వం ప్రకటించింది. అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (రూ. 18,100 కోట్లు), ఫాస్టర్ అడాప్షన్ ఆఫ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ స్కీమ్ (రూ. 10,000 కోట్లు) కలిపి ఈ పీఎల్ఐ స్కీమ్‌ను ప్రకటించింది. పర్యావరణపరంగా హితకరమైన, ఎలక్ట్రానిక్ వాహనాలు, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ వాహనాలు పెద్ద ఎత్తున వస్తాయి. స్వయం సమృద్ధ భారత దేశం దిశగా అడుగులు వేస్తూ ఈ పథకానికి ఆమోదం తెలిపినట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది.



## ఏపీలో కొత్తగా 1,445 కరోనా కేసులు

అమరావతి: రాష్ట్రంలోని కరోనా పరిస్థితులపై అధికారులు ప్రకటన విడుదల చేసారు. ఏపీలో కొత్తగా 1,445 కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనాతో 11 మంది మృతి చెందారు. ఏపీలో మొత్తం 20,33,419 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. కరోనాతో ఇప్పటివరకు 14,030 మంది మరణించారు. ఏపీలో 14,603 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా నుంచి 20,04,786 మంది రికవరీ చెందారు.



## దిశ చట్టం ప్రతులు లోకేష్ చింపడం దారుణం: మంత్రి తానేటి వనిత

అమరావతి: దిశ చట్టం ప్రతులు నారా లోకేష్ చింపడం దారుణమని స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. గతంలో ఎప్పుడైనా టీడీపీ ప్రభుత్వం ఇలాంటి చట్టం తీసుకొచ్చిందా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో, శాసన మండలిలో దిశ చట్టాన్ని ఆమోదించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో అనూషపై యాసిడ్ దాడి జరిగితే పరిహారం కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అలాంటి వాళ్ళు ఇప్పుడు పరిహారం కోసం విమర్శలు చెస్తున్నారని మండిపడ్డారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగితే రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని, వాళ్ల ప్రభుత్వంలో మహిళలపై దాడులు జరిగితే ఏనాడు టీడీపీ నేతలు పట్టించుకోలేదని విమర్శించారు. ఈ రోజు మహిళల కోసం తమపై విమర్శలు చేస్తే ఎవరూ నమ్మరని, దిశ చట్టంతో పాటు మహిళలకు నేరాలు జరగకుండా కాపాడేందుకు దిశ యాప్‌ను తీసుకొచ్చామని వెల్లడించారు. తమ ప్రభుత్వం నమ్మకం కలిగించడం వలన మహిళలు ధైర్యంగా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. గతంలో మహిళలపై కేసుల విచారణకు 4 నెలలు పట్టేది కానీ ఈ ఏడాది 40 రోజులలోనే విచారణ పూర్తి చేసిన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు మహిళలపై దాడులు జరిగితే వారం రోజుల్లోనే చాలా కేసుల్లో విచారణ పూర్తి చేశామని మంత్రి తానేటి వనిత తెలిపారు.



# సంపాదకీయం

గురువారం 16 సెప్టెంబరు 2021

## స్పోర్ట్స్ వారియర్స్ కు ప్రోత్సాహం

పారాఒలింపిక్స్ లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులతో సమావేశం అయ్యారు. పతకాలు సాధించిన వారికి ట్రీట్ ఇచ్చారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. క్రీడలకు అంగవైకల్యం అడ్డుకాదని, దీనికి ఉదాహరణ పతకాలు సాధించిన క్రీడాకారులే అని ప్రధాని మోడీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పతకాలు సాధించిన ప్రతి ఒక్కరిని ప్రధాని పలకరించారు. ప్రధానిని కలిసినందుకు క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరి తోనూ ఆయన కాసేపు ముచ్చటించడం మరింత ప్రోత్సాహాన్నిచ్చింది. భారత క్రీడాకారుల కోసం ఏ నిర్ణయమైనా తీసుకోగల వ్యక్తి కూడా ప్రధానిలో కనిపిస్తారు. టోక్యో ఒలింపిక్స్ ప్రారంభానికి ముందే అక్కడ మన క్రీడాకారుల సంసిద్ధతపై నరేంద్ర మోదీ విస్తృత స్థాయి సమీక్ష నిర్వ హించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆయన క్రీడా మహా కుంభమేళాను ప్రారంభించారు. దీంతో అప్పటి దాకా క్రీడాంగణంలో చారిత్రక నైపుణ్యం అంతగా కానరాని ఆ రాష్ట్రంలో అట్టడుగు స్థాయి నుంచీ క్రీడాస్ఫూర్తి పెల్లుబికింది. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్స హించడంలో నరేంద్ర మోదీకి తనదంటూ ఒక పద్ధతి ఉంది.కొన్ని రోజుల కిందట 2013 నాటి ఒక వీడియో విస్తృత ప్రాచు ర్యంలోకి వచ్చింది. అది పుణెలో కొందరు కళాశాల విద్యార్థులను ద్దేశించి నరేంద్ర మోదీ ప్రసంగిస్తున్న వీడియో. ప్రతిభగల భారీ జనాభాతోపాటు భారతదేశానికి ఉజ్వల క్రీడాచరిత్ర ఉన్నప్పటికీ ప్రతి ఒలింపిక్స్‌లో పతకాల సంఖ్యను పెంచుకోవడానికి పెనుగులాడాల్సి రావడం శోచనీయమని తన ప్రసంగంలో ఆయన ఎంతో వేదన వ్యక్తం చేశారు. భారత్ వంటి దేశం ఒలింపిక్స్ విజయాలు పొందలేకపోవ డానికి సమస్య క్రీడాకారుల పరమైనది కాదని... వారికి సముచిత ప్రోత్సాహ కల్పనలో వ్యవస్థ వైఫల్యమే కారణమని తనకు అర్థమైంద న్నారు. క్రీడలకు తగిన మద్దతు, గౌరవం లభించాల్సి ఉందని అభిప్రా యపడ్డారు. ఈ నేపథ్యంలో తమ ఓటమి సందర్భంగా ప్రధాని స్వయంగా సంభాషించడమే తమ నైతిక స్థైర్యం ఇనుమడించడంలో కీలకపాత్ర పోషించిందని పురుషుల, మహిళల హాకీ జట్లు చెప్పడం ఈ సందర్భంగా గమనార్హం. ఇక క్రీడల విషయానికొస్తే? క్రీడల్లో పాల్గొనడానికి... ఆ దిశగా యువతకు లభించే ప్రోత్సాహానికీ మధ్య విస్తృత అగాథం ఉందని గుర్తించారు. ఒలింపిక్స్ విజేతలతో విందు సమావేశం అనంతరం మాట్లాడుతూ? "క్రీడలలో మనవాళ్ల ఇటీవలి విజయాలను చూశాక ఆటలపై తల్లిదండ్రుల ధోరణిలో సానుకూల మార్పు తప్పక వస్తుం దన్న విశ్వాసం కలిగింది" అన్నారు. ఈ క్రీడలలో భారత పతకాల సంఖ్య పెరగడం చూసిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటలవైపు ప్రోత్సహిస్తారన్న ఆశలు ప్రధాని వ్యాఖ్యతో మరింత పెరిగాయి. భారత క్రీడా విజయాలను మరింత పెంచడానికిగల పలు మార్గాల్లో "ఒక రాష్ట్రం ? ఒక క్రీడ" దృక్పథంతో రాష్ట్రాలను ప్రోత్సహించడం కూడా ఒకటి. ఆ మేరకు ఏదైనా ఒకటి లేదా కొన్ని క్రీడలకు ఆయా రాష్ట్రాలు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వవచ్చు. తమ పరిధిలోగల ప్రతిభా నిధి, సహజ ఆసక్తి, వాతా వరణ పరిస్థితులు సహా ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల లభ్యత ఆధారంగానూ ఒక నిర్ణయం తీసుకోవచ్చు. భారత క్రీడారంగ ప్రగతికి దోహదపడిన అంశాల్లో నాణ్యత, అంతర్జాతీయ ప్రమాణా లకు పెద్దపీట వేయడం మరొకటి. ఈ దిశగా సంప్రదాయక మార్గం అధికార యంత్రాంగం ప్రమేయంతో కూడుకు న్నదే కాకుండా ప్రయాస కూడా అధికం. కానీ, మోదీ ప్రభుత్వంలో ఈ పరిస్థితి పూర్తిగా మారిపో యింది. ఆ మేరకు క్రీడాకారుల నుంచి సాక్షాత్తూ ప్రధానమంత్రే నేరుగా సమాచారం స్వీకరించడానికి ప్రాధాన్యమిచ్చారు. తదను గుణంగా క్రీడా మౌలిక వసతుల బలోపేతానికి గల వివిధ మార్గాలపై వారి అభిప్రాయాలను తనతో పంచుకోవాలని టోక్యో?2020కి వెళ్లే క్రీడాకారుల బృందాన్ని ఆయన కోరారు. ఇక మీరాబాయి కావచ్చు... మేరీకోమ్ కావచ్చు... క్రీడాకారులు ఎవరైనప్పటికీ గాయాలపాలై నపుడు వారికి మోదీ అత్యుత్తమ చికిత్స లభించేలా చూశారు.భారత క్రీడారంగంపై ప్రతికూల ప్రభావం చూపిన ఇతర అంశాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వికాసం కూడా ఒకటి. ఈ విషయాన్ని మోదీ తన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకంలోనే కాకుండా 'పరీక్షలపై చర్చ' కార్యక్రమాల సందర్భం గానూ ప్రస్తావించారు. ఆ మేరకు 'ప్లే స్టేషన్'తో సమానంగా 'ప్లేయింగ్ ఫీల్డ్' కూ ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రగతితో పాటు క్రీడలలో మానవ ప్రమేయం? జట్టు తత్వం, కలివిడితనంతో కూడిన ఆరోగ్యకర సమతూకం అవసరమని ఉద్బో దించారు. రాబోయే కాలంలో భారతదేశపు తొలి క్రీడా విశ్వవిద్యా లయం మణిపూర్‌లో సాకారం కానుంది. ఇది క్రీడాకారులకు ఒక వరం మాత్రమే గాక ముఖ్యంగా ఈశాన్య భారతంలోని సుసంపన్న క్రీడా వారసత్వాన్ని ప్రోదిచేసేందుకు ఉపయోగపడుతుంది.టోక్యో?2020 భారత్ అనేక తొలి ఘనతలు సాధించిన ఒలిం పిక్స్. అథ్లెటిక్స్ విభాగంలో తొలి స్వర్ణపతకం మన వశమైంది. హాకీ జట్టు అద్భుతాలు చేసింది... డిస్కస్ త్రో, గోల్ఫ్, కత్తి యుద్ధం వగైరా క్రీడల్లోనూ మనవాళ్లు విజయవంతమయ్యారు. మొత్తంమీద నవభార తంలో నేడు ఉత్సాహం పరవళ్లు తొక్కుతోంది... మన క్రీడలకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం లభిస్తుంది. క్రీడల్లో రాణించా లని ఆరాటపడే క్రీడాకారులకు మన ప్రధాని సదా అండగా నిలుస్తారు

## భూ సమస్యల పరిష్కారం దిశగాఅడుగులు

విజయనగరం, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)దశాబ్దాల కాలంగా రైతులను వెంటాడు తున్న భూ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడగులేస్తోంది. భూముల సమగ్ర సర్వేకు సన్నద్ధమవుతోంది. 2021 జనవరి నెల నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించేందు కు ఏర్పాట్లు చేస్తోంది. రైతుల భూములకు చెందిన రికార్డుల సమస్యలను గుర్తించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భూ సమగ్రసర్వే చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 12లక్షల60వేల377ఎకరాల 20 సెంట్ల భూమిని అధికారులు సర్వే చేయనున్నారు. దీనివల్ల భూముల వివరాలు పక్కాగా నమోదవుతాయని, ఎలాంటి వివాదాలకు తావుండదని, వివాదాల్లో ఉన్న భూములకు పరిష్కారం దొరుకుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. గతంలో పట్టాదారు పాస్ పుస్తకం ఒకరి పేరు మీద ఉంటే రెవెన్యూ రికార్డుల్లో ఇంకొకరి పేరుతో ఆ భూమి ఉండేది. ఫలితంగా సంక్షేమపథకాలు సంబంధిత రైతులకు అందడంలేదు. మరోవైపు తల్లిదండ్రులు మృతిచెందితే... వారిపేరు మీద ఉన్న భూములు వారసుల పేరుకు మార్చేందుకు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వస్తోంది. ఈ సమస్యలన్నింటికీ సమగ్ర సర్వే ఒక్కటే మార్గమని సీఎం భావిస్తున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం? కంటిన్యూస్ ఆపరేటింగ్ రిఫరింగ్ స్టేషన్ నెట్‌వర్క్ సాయంతో సమగ్ర భూసర్వేకు సన్నద్ధమవుతున్నారు. గ్రామాల్లో రైతులకు ఉన్న భూములను గుర్తించి ఆధార్ కార్డుల ఆధారంగా వారి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేస్తారు. చిన్నచిన్న కమతాల నుంచి భూస్వాముల వరకూ ప్రతీది నమోదు చేస్తారు. జనవరి నుంచి ఈ పునఃసర్వే జరగనుంది. తొలుత మెట్ట ప్రాంతాలను తీసుకోగా, అనంతరం పల్లపు భూములను కొలతలు వేసి ప్యూరిఫికేషన్ చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు సర్వేయర్లతో పాటు ఇతర అధికారులకు శిక్షణ ఇస్తోంది. ముందుగా తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తారు. అక్కడి నుంచి రికార్డులు గ్రామస్థాయిలోకి వెళ్తా యి. రైతులకు ఉన్న వాస్తవ భూమిని పరిశీలించి సరి చేస్తారు. చిన్నచిన్న సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కరిస్తారు. పెద్ద, పెద్ద సమస్యలను తహసీల్దార్ సమక్షంలో పరిష్కరిస్తారు. క్షేత్రస్థాయి నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. కోర్టులో కేసులు ఉన్నవాటి వివరాలను ప్రస్తుతానికి పెండింగ్‌లో ఉంచుతారు. మిగిలిన భూము ల వివరాలు మొత్తం ఆన్‌లైన్ కానున్నాయి. వీటితో పాటు ఇంటిపట్టాల వివరాలు, పొజిషన్ సర్టిఫికెట్లు, ప్రభుత్వం ఇవ్వనున్న ఇళ్ల స్థలాలు పట్టాలు కూడా ఆన్‌లైన్ కానున్నాయి.

## భారీగా పెరగనున్న సాగు విస్తీర్ణం..

కాకినాడ, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)సమృద్ధిగా ఉన్న సాగునీటితో వరి సాగులో ఉభయ గోదావరి జిల్లాలు అగ్రస్థానంలో నిలిచి ధాన్యాగారంగా భాసిల్లుతుండగా అనంతపురం జిల్లాలో ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగును రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో వినియోగించుకుంటూనే అలాంటి అవకాశం లేని చోట్ల ఇతర పంటలను సాగు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసింది. పండ్ల ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ కోసం అనంతపురం నుంచి దేశ రాజధానికి ప్రత్యేకంగా కిసాన్ రైలు ఇప్పటికే ప్రారంభమైంది. రైతన్నకు ఆదాయంతోపాటు అందరికీ ఆరోగ్యాన్ని పంచేలా చిరుధాన్యాల వినియోగాన్ని పెంచేలా మిల్లెట్ బోర్డును ఏర్పాటు చేసింది. డలి వైపు కదిలిపోతున్న కృష్ణా, గోదావరి, వంశధార, నాగావళి, పెన్నా జలాలను ఒడిసి పట్టడం ద్వారా ఈ ఖరీఫ్‌లో 1.11 కోట్ల ఎకరాలకు సాగు నీరందించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలో భారీ, మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులు, ఏపీఎస్ఐడీసీ(ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ) ఎత్తిపోతల పథకాల కింద ఇప్పటికే 52 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టులో రైతులు పంటలు సాగు చేశారు. నాగార్జునసాగర్‌కుడి, ఎడమ కాలువలు, రాయలసీమలో తెలుగుగంగ, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, తుంగభద్ర హెచ్చెల్సీ, ఎల్లెల్సీ, నెల్లూరు జిల్లాలో పెన్నా డెల్టా, సోమశిల, కండలేరు ఆయకట్టులో పంటల సాగులో నిమగ్నమయ్యారు. ఈ నెలాఖరునాటికి సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుందని, నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఆయకట్టుకు నీళ్లందిస్తామని జలవనరులశాఖ వర్గాలు తెలిపాయి. గతేడాది ఖరీఫ్‌లో 1,00,44,463 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించారు. రాష్ట్ర చరిత్రలో ఖరీఫ్‌లో కోటి ఎకరాలకు నీళ్లందించడం అదే ప్రథమం. ప్రస్తుత ఖరీఫ్‌లో 1,11,41,471 ఎకరాలకు నీళ్లందించడం ద్వారా గత రికార్డును తిరగరాసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గతేడాది 171.37 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేయడం సరికొత్త రికార్డు నెలకొల్పిన ప్రభుత్వం దేశానికి ధాన్యాగారంగా రాష్ట్రాన్ని మరోసారి నిలబెట్టింది. ఈ ఏడాది అంతకంటే ఎక్కువగా దిగుబడులు సాధించేలా అన్నదాతలను ప్రోత్సహించడం ద్వారా 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా రాష్ట్రానికి ఉన్న పేరును ఇనుమడింపజేయాలని నిర్ణయించింది. కృష్ణమ్మ పరవళ్లతో పరీవాహక ప్రాంతం (బేసిన్)లో ప్రాజెక్టులు నిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి. వరద ప్రవాహం ఇంకా కొనసాగుతోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులో గరిష్ట స్థాయిలో 561 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. తుంగభద్ర డ్యామ్‌లో 100.86 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. పెన్నా బేసిన్‌లో గండికోట, మైలవరం, వెలిగోడు, సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో 115 టీఎంసీల మేర నిల్వ ఉన్నాయి. వంశధారలో వరద ప్రవాహం కొనసాగుతోంది. జూన్ 9న ఎత్తిన గొట్టా బ్యారేజీ గేట్లు ఇప్పటివరకూ దించలేదు. నాగావళి బేసిన్‌లో తోటపల్లి బ్యారేజీ, నారాయణపురం ఆనకట్ట గేట్లను కూడా దించలేదు. ఏలేరు బేసిన్ ఏలేరు ప్రాజెక్టులో 22.42 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఇప్పటిదాకా 6,86,614 ఎకరాల ఆయకట్టులో వరి సాగుతో ప్రథమ స్థానంలో ఉండగా తూర్పుగోదావరి 6,77,224 ఎకరాల్లో వరి సాగుతో రెండో స్థానంలో ఉంది. కృష్ణా జిల్లా 6,08,973 ఎకరాల్లో వరి సాగుతో మూడో స్థానంలో నిలిచింది. 5,73,531 ఎకరాల్లో వరి సాగుతో శ్రీకాకుళం జిల్లా నాలుగో స్థానంలో ఉంది. మొత్తమ్మీద ఇప్పటిదాకా సుమారు 52 లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలో అన్నదాతలు వరి, మొక్కజొన్న, వేరుశనగ, మిర్చి తదితర పంటల సాగు చేపట్టారు.

## చలపతిరావుకు గవర్నర్ గిరీ...

విశాఖపట్టణం, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)బీజేపీ అంటే ఉత్తరాది పార్టీ అని అంతా భావించే రోజులు అవి. అలాంటి బీజేపీని దక్షిణాదికి పరిచయం చేసిన ఘనత అచ్చంగా పీవీ చలపతిరావుది. ఆయన జనసంఘ్ కాలం నుంచి పనిచేస్తూ వస్తున్న వరిష్ట నేత. చలపతిరావు కరడు కట్టిన సంఘ్ కార్యకర్త. ఏపీలో కాంగ్రెస్ అప్రతిహతంగా తన హవా కొనసాగిస్తున్న రోజుల్లో మరో వైపు బలంగా ఉన్న కమ్యూనిస్టులను కూడా ఎదుర్కొని కాషాయం జెండా పాతిన ఘనత పీవీదే. ఆయన జనసంఘ్ నుంచి రెండు సార్లు ఎమ్మెల్సీగా గెలిచారు కూడా. ఇక బీజేపీగా రూపాంతరం చెందాక 1980లో ఉమ్మడి ఏపీకి తొలి అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. అనాడే దక్షిణాదిన కమల వికాసం జరిగింది. అప్పట్లో విశాఖ మేయర్ సీటుని బీజేపీ గెలుచుకోవడం వెనక పీవీ కృషి చాలా ఉంది. ఉమ్మడి ఏపీలో పీవీ చలపతిరావుకి సరిసాటి నేతలు ఈ రోజున ఎవరూ లేరు. ఆయన వాజ్ పేయ్, అద్వానీ సరిసాటి నేత. ఆయన బీజేపీ కోసం ఎంతో చేశారు. ఒక విధంగా చూస్తే తన మొత్తం జీవితాన్ని ధారపోశారు అని కూడా చెప్పాలి. ప్రతీ ఎన్నికల్లోనూ ఆయన విశాఖ నుంచి బీజేపీ తరఫున ఎంపీగా పోటీ చేసేవారు. డిపాజిట్లు గల్లంతు అవుతున్నా కూడా ఈ పోటీ చేయడం ఎందుకు అంటే పార్టీని బతికించుకోవడానికి అని బదులిచ్చేవారు. ఎవరినా ఓడిపోతామని తెలిసి పోటీ చేస్తారా. కానీ పీవీ ఎక్కడా ఆత్మస్థైరం కోల్పోకుండా కాషాయం జెండా వెంట నడించారు. దానినే జీవితాంతం ప్రేమించారు. అటువంటి పీవీ చలపతిరావుకి ఏ అధికారిక హోదాలు దక్కలేదు. ఆయన పార్టీకి చేసిన సేవలకు గానూ కనీసం ఒక రాష్ట్రానికి గవర్నర్ గా అయినా నియమిస్తారు అనుకుంటే అది కూడా లేకుండా పోయిందని అభిమానులు బాధపడతారు. వాజ్ పేయ్ ప్రధాని అయిన కొత్తల్లో తన సహచరులకు పదవులు ఇవ్వాలనుకున్నారు. అలా ఆయన నాడు ఏపీలో ఉన్న పీవీ చలపతిరావు గురించి వాకబు చేశారట. ఆయనను సమాదరించి కీలకమైన రాష్ట్రానికి గవర్నర్ గా చేయాలనుకున్నారట. అయితే నాడు ఏపీలో బీజేపీ మీద పెత్తనం చేస్తున్న ఒక బడా నాయకుడు పీవీకి ఆ పదవిని దక్కనీయకుండా చేశారు అని ప్రచారంలో ఉంది. పీవీ చలపతిరావుకి అనారోగ్య సమస్యలు అంటూ కేంద్ర పెద్దలను ఆయనే తప్పుతోవ పట్టించారని చెబుతారు.బీజేపీని తేడా గల పార్టీ అంటారు. పార్టీలో పనిచేసిన వారికే అగ్ర తాంబూలం అని చెబుతారు.

కానీ ముందొచ్చిన చెవుల కంటే వెనక వచ్చిన కొమ్ములు వాడి అని ఆ పార్టీ పెద్దలే నిరూపిస్తున్నారు అంటున్నారు. పీవీ చలపతిరావు వద్ద శిష్యరికం చేసిన వారంతా ఉన్నత పదవులు అలంకరించారు. ఆయన రాజకీయాల్లో చిరకాలం ఉన్నా వ్యవహారం తెలియక అలాగే ఉండిపోయారు. పార్టీ కోసం అంటూ ఎమర్జెన్సీ కాలంలో కూడా ప్రాణాలకు తెగించి పోరాడిన ఆయనకు దక్కిందేంటి అన్న బాధ అయితే అభిమానుల్లో ఉంది. జైలుకు వెళ్ళి అష్టకష్టాలు పడిన పీవీకి చివరికి ఏ పదవీ లేకుండా చేశారు అన్నదే బీజేపీని అభిమానించే అసలైన కార్యకర్తల వేదన కూడా. నాడు వాజ్ పేయి టైమ్ లో ఆరేళ్ళు, మోడీ జమానాలో ఏడేళ్ళు అధికారంలో పార్టీ ఉన్నా కూడా పీవీ చలపతిరావుకి ఒక పదవి ఇవ్వడానికి టైమ్ సరిపోలేదా, లేక చేతులు రాలేదా అన్న సూటి ప్రశ్నకు పెద్దల వద్ద జవాబు ఉందా.

## మాగంటి బాబు రిటైర్మెంటేనా

ఏలూరు, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ ఈక్వేషన్లు మారుతున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా కొత్త నేత పేరు వినిపిస్తోంది. పైగా.. ఈయన గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి.. తర్వాత.. ఆయన కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌కు కూడా సన్నిహితంగా మెలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయనే కొఠారు దొరబాబు. చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డి గూడెం మండలం.. లక్కవరం గ్రామానికి చెందిన దొరబాబు..ప్రస్తుతం టీడీపీలో చింతలపూడి.. పోలవరం పరిశీలకులుగా ఉన్నారు. అయితే..ఆయనకు త్వరలోనే ఏలూరు పార్లమెంటు పగ్గాలను అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం.. నిన్న మొన్నటి వరకు దాదాపు పాతికేళ్లుగా .. మాజీ ఎంపీ మాగంటి వేంకటేశ్వరరావు ఉరఫ్ బాబు కనుసన్నల్లోనే ఉందనేది అందరికీ తెలిసిందే. 1996 నుంచి ఆయన ఇక్కడ రాజకీయాలను శాసిస్తున్నారనే వాదన ఉంది. 1996, 1998, 1999 ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. ఈ క్రమంలో 1998లో మాత్రమే ఆయన విజయం దక్కించుకున్నారు. ఆ తర్వాత.. 2004లో దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి.. విజయం సాధించి.. వైఎస్ మంత్రి వర్గంలో కేబినెట్ బెర్త్‌ను సంపాయించుకున్నారు. ఆ తర్వాత.. వైఎస్‌తో తలెత్తిన విభేదాల కారణంగా.. ఆయన టీడీపీలోకి చేరిపోయారు. ఈ క్రమంలోనే 2009లో టీడీపీ నుంచి ఏలూరు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో మళ్లీ ఇక్కడ నుంచే పోటీ చేసిన బాబు.. లక్ష ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇక, గత 2019 ఎన్నికల్లో జగన్ సునామీలో లక్షా 60 వేల ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అయితే.. అప్పటికే ఆయన అనారోగ్యంతో ఇబ్బందులు పడడం తెలిసిందే. ఇక, ఇటీవల ఆయన ఇద్దరు కుమారులు ఒకరి తర్వాత.. ఒకరుగా మృత్యువాత పడడంతో ఇక, ప్రత్యక్ష రాజకీయాలకు దాదాపు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఏలూరులో టీడీపీకి కీలకమైన అభ్యర్థి అవసరం ఏర్పడింది. దీంతో ఇదే జిల్లాకు చెందిన దొరబాబుకు అవకాశం ఇస్తారని.. టీడీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. 2019 ఎన్నికలకుముందు వరకు ఆయన వైజాగ్‌లో సెటిల్ అయ్యారు. అక్కడే వైజాగ్ డిప్యూటీ మేయర్‌గా పనిచేశారు. దివంగత సీఎం వైఎస్‌కు సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్నారు. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత.. వైఎస్ ఎప్పుడు విశాఖ వచ్చినా.. ఆయన కార్యక్రమాలను దొరబాబు దగ్గరుండి చూసుకునేవారు. తర్వాత వైసీపీలో ఉన్నప్పుడు కూడా జగన్‌కు సన్నిహితంగా ఉన్నారనే పేరు తెచ్చుకున్నారు. 2014లో టీడీపీ గెలిచాక మళ్లీ ఆయన చంద్రబాబుకు దగ్గరయ్యారు.ప్రస్తుతం తన సొంత జిల్లా పశ్చిమ గోదావరిలోనే ఉంటూ.. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల పరిశీలకుడిగా టీడీపీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బాబుకు కూడా.. సన్నిహితంగా ఉంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కూడా చంద్రబాబు వైజాగ్ వెళ్లిన ప్రతిసారీ.. దొరబాబే అన్నీ అయి వ్యవహించేవారు. దీంతో చంద్రబాబుకు కూడా ఆయన సన్నిహితులనే పేరు తెచ్చుకున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. సామాజిక సమీకరణలు ఎలాగూ ఆయనకు ప్లస్ కానున్నాయి. ఈ క్రమంలోనే ఏలూరు పార్లమెంటు అభ్యర్థిగా చంద్రబాబు దొరబాబుకే మొగ్గు చూపుతున్నారనిపార్టీలో చర్చ సాగుతుండడం గమనార్హం.



## జనాల్లోకి తమ్ముళ్లు..బాబు ఫుల్ హ్యాపీ

విజయవాడ, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)త రెండున్నరేళ్లుగా ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. రెండేళ్ల నుంచి పార్టీ నేతల నుంచి క్యాడర్ వరకూ నిరాశా నిస్పృహలో ఉంది. ఏ కార్యక్రమానికి పిలుపు ఇచ్చినా పెద్దగా స్పందన ఉండటం లేదు. అయితే గత కొన్ని నెలల నుంచి నేతల్లో మార్పు స్పష్టంగా కన్పిస్తుంది. కసి పెరిగింది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎలాగైనా గెలిపించాలన్న తపన క్యాడర్ లో మొదలయింది. చంద్రబాబు ఇటీవల కాలంలో ఇచ్చిన పార్టీ కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తుంది. తాజాగా ఈరోజు టీడీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలు ప్రతి నియోజకవర్గంలో జరిగాయి. కేంద్ర పార్టీ కార్యాలయానికి వచ్చిన నివేదికల ప్రకారం ప్రతి నియోజకవర్గంలో నేతల పార్టిసిపేషన్ ఉంది. మండల స్థాయిలో జెండాలు ఎగిరాయి. స్వయంగా ఈ నిరసన కార్యక్రమంపై జిల్లాల నుంచి నివేదికలు తెప్పించుకున్న చంద్రబాబు ఖుషీ అయ్యారంటున్నారు.చంద్రబాబు జగన్ ను ఓడించడం సంగతి పక్కన పెడితే ముందుగా నేతలను, క్యాడర్ ను మోటివేట్ చేయడంలో సక్సెస్ అయ్యారనే చెప్పాలి. నిజానికి గతంలో ఎన్నడూ లేని విధంగా మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత చంద్రబాబు నేతలను కంట్రోల్ చేయడంలో విఫలమయ్యారు. ఒక దశలో నాయకత్వంపై కూడా అనుమానాలు తలెత్తాయి. కానీ చంద్రబాబు మాత్రం నేతలను మోటివేట్ చేయడానికి నిత్యం ప్రయత్నించేవారు.గత రెండేళ్లుగా సాధ్యం కాని పని రెండు నెలల నుంచి గాడిలో పడింది. నేతలు వీధుల్లోకి వస్తున్నారు. జెండాలు చేత పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదం తొక్కుతున్నారు. ఈ ఒక్కరోజే 175 నియోజకవర్గాల్లో క్యాడర్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చింది. పోలీసులు అరెస్ట్ చేసినా అనేక చోట్ల నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లాల నుంచి నివేదికలు తెప్పించుకున్న చంద్రబాబు ఈరోజు హ్యాపీ మూడ్ లోకి వెళ్లిపోయారు.

## మల్లాది విష్ణుకు ఇంటి పోరు

విజయవాడ, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)రాజకీయంగా ఎప్పుడు ఎలాంటి పరిణామమైనా చోటు చేసుకునే అవకాశం మెండుగా ఉంది. బళ్లు ఓడలు, ఓడలు బళ్లు అవుతాయని అంటారు పరిశీలకులు. ఏనిముషానికి ఏం జరిగినా.. జరగొచ్చని చెబుతారు. ఇప్పుడు ఇలాంటి పరిణామమే.. బెజవాడ రాజకీయాల్లోనూ చోటు చేసుకుందని అంటున్నారు పరిశీలకులు. ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణును ప్రభుత్వం పక్కకు తప్పించింది. ఈ పదవిని సీతంరాజు సుధాకర్‌కు అప్పగించారు. అయితే.. ఈ అనూహ్య మార్పు వెనుక ఏం జరిగిందనేది కీలక చర్చగా మారింది. అసలు మల్లాది విష్ణు వంటి కీలక నేతను పక్కకు పెట్టి.. ఎందుకిలా చేశారు? అనేది ఆసక్తిగా మారింది.వాస్తవానికి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో గెలిచిన మల్లాది విష్ణు జగన్ కేబినెట్లో బ్రాహ్మణ కోటాలో మంత్రి పీఠాన్ని ఆశించారు. దీనికి గాను ఆయన గతంలో వైఎస్‌తో తనకున్న అనుబంధాన్ని వాడుకున్నారు. అయితే.. ఆయన ఎన్నిక లకు ముందు పార్టీలో చేరడం.. పెద్దగా మెజారిటీ కూడా రాకపోవడం.. వంటి పరిణామాల నేపథ్యంలోను.. అప్పటికే మరికొందరు సీనియర్లు కూడా ఉండడంతో జగన్ ఈయనను పరిగణనలోకి తీసుకోలేదు. అదే సమయంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి విజయం దక్కించుకున్న వైశ్య సామాజిక వర్గానికి చెందిన వెలంపల్లికి అవకాశం ఇచ్చారు.నిజానికి ఈ ఇద్దరూ వైసీపీకి కొత్త నేతలే. ఒకరు బీజేపీ నుంచి కొంత ముందు వస్తే.. మరొకరు కాంగ్రెస్ నుంచి కొంచెం లేటుగా వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు అంతే. అయినప్పటికీ.. వెలంపల్లికి అవకాశం చిక్కడం.. సహజంగానే మల్లాది విష్ణు వర్గంలో అసంతృప్తిని రేపింది. ఇక, అప్పటి నుంచి ఇరు వర్గాలు.. సంపూర్ణంగా సహకరించుకోవడం మానేశాయి. ఈ పరిణామాలు ఇలా ఉంటే.. మంత్రి పదవిని ఆశించిన మల్లాది విష్ణుకి .. జగన్ బ్రాహ్మణ కార్పొరేషన్ పగ్గాలు అప్పగించారు. ఇది దాదాపు దేవదాయ శాఖతో ముడిపడి ఉండడం.. దేవదాయ శాఖమంత్రిగా ఉన్న వెలంపల్లికి ఈయనకు మధ్య అంతర్గత విభేదాలు సాగుతుండడంతో కార్పొరేషన్‌ను మల్లాది విష్ణు పూర్తిగా పట్టించుకోవడం మానేశారు.ఇక, ఈ క్రమంలోనే ఇరువురి మధ్య సఖ్యతలేకపోవడం.. వెలంపల్లికి అనుకూలంగా ఒక సలహాదారు వ్యవహరించిన ఫలితంగా.. కార్పొరేషన్ పదవి నుంచి మల్లాది విష్ణుని పక్కన పెట్టారని.. విజయవాడ రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. అదే సమయంలో మల్లాది విష్ణు వర్గం ఈ విషయంలో ఫుల్లు సైలెంట్ అయిపోయింది. కానీ, వెలంపల్లి వర్గం మాత్రం .. అనూహ్యంగా ఒక వింత ప్రచారం ప్రారంభించింది. మల్లాది విష్ణుకి త్వరలోనే మంత్రి పదవి ఇస్తారని.. అందుకే తప్పించారని.. వెలంపల్లి వర్గంగా ఉన్న కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం గమనార్హం. జగన్ దృష్టిలో మల్లాది విష్ణును చెడుగా చూపడానికి ఇలాంటి పోస్టింగ్ లు పెడుతున్నారట. మొత్తంగా చూస్తే.. మల్లాది విష్ణు ఎపిసోడ్‌లో తెరవెనుక అనేక సంగతులు వున్నాయని అంటున్నారు పరిశీలకులు.

## చంద్రబాబు మౌనం వెనుక

విజయవాడ, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)టీడీపీ అధినేత, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ సిద్ధాంతమే బాగా కలిసి వస్తోందని అంటున్నారు పరిశీలకులు. ప్రస్తుతం రాష్ట్రం కొన్ని కీలక విషయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇవి రాష్ట్ర భవిష్యత్తుకే కాకుండా పలు పార్టీలకు కూడా ముడిపడిన వ్యవహారాలు. అయినప్పటికీ చంద్రబాబు ఆయా విషయాలపై నోరు విప్పడం లేదు. తన బదులు తన వారిని అన్నట్టుగా కొందరు నేతలను రంగంలోకి దింపుతున్నారు. దీంతో వారే ఆయా విషయాలపై మాట్లాడుతున్నారు.అయితే.. ఇదంతా చంద్రబాబు వ్యూహాత్మకంగా చేస్తున్న పనని అంటున్నారు పరిశీలకులు. ప్రస్తుతం కొన్ని విషయాల్లో చంద్రబాబు మౌన సిద్ధాంతాన్ని ఎంచుకున్నారని.. మౌనంగా ఉంటేనే తనకు మంచిదని భావిస్తున్నారని.. వారు చెబుతున్నారు. ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు నోరు విప్పడం లేదు. కేవలం అంచనాల విషయానికి వస్తే మాత్రమే .. మాజీ మంత్రి దేవినేని ఉమను రంగంలోకి దింపుతున్నారు. కానీ, పునరావాసం, ఇక్కడి గిరిజనుల విషయం వస్తే .. టాపిక్ డైవర్ట్ చేస్తున్నారు. అదే సమయంలో వెలిగొండ ప్రాజెక్టు విషయంలోనూ అనూహ్యమైన మౌనంగా ఉన్నారు.ఇక, ఉత్తరాంధ్ర వేదిక పేరుతో టీడీపీ నాయకులు హల్ చల్ చేస్తుంటే.. చంద్రబాబు మాత్రం పూర్తిగా సైలెంట్ అయ్యారు. ఆయన ఒక్కమాట కూడా మాట్లాడలేదు. రాయలసీమ అభివృద్ధి పై కూడా ఆ ప్రాంత నేతలకే చంద్రబాబు విమర్శలను అప్పజెప్పారు. దీనికి కారణం.. ఏంటి ? ఎందుకు ఇంత వ్యూహాత్మకంగా మౌన సిద్ధాంతాన్ని ఎంచుకున్నారు ? అంటే.. గతంలోనే ఆయా ప్రాజెక్టులు తన పాలనలో అమలు జరిగి ఉండాల్సినవి. కానీ, చంద్రబాబు వాటిని పెద్దగా లక్ష్యంలోకి తీసుకోలేదు.ఇలా కీలకంగా భావించిన పోలవరం విషయంలో తప్పటడుగులు వేసి పూర్తిచేయలేకపోయారు. ఇక రాజధాని విషయంలో చంద్రబాబు పెద్ద మాయాలోకాన్నే క్రియేట్ చేశారు. రాజధాని మాత్రం సగం కూడా పూర్తవ్వలేదు. దీంతో ఇప్పుడు ఆయా అంశాలపై నోరు విప్పితే.. అడ్డంగా బుక్కయి..ప్రజల్లో పలుచన అవడం ఎందుకనే ధోరణితోనే చంద్రబాబు సైలెంట్ అయ్యారని.. ఆయన మౌన సిద్ధాంతం పాటిస్తున్నారని అంటున్నారు. మరి ఇది ఏమేరకు ఆయనకు మేలు చేస్తుందో చూడాలి.

# ఉత్తరాంధ్రలో వైసీపీకీ వార్నింగ్ బెల్స్

విశాఖపట్టణం, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)ఉత్తరాంధ్రాలోని మూడు జిల్లాలే టీడీపీకి మూడు మూర గట్టిగా కొట్టాయి. పార్టీ పెట్టాక పుట్టాక కనీ వినీ ఎరుగని ఘోర పరాభవం 2019 ఎన్నికల్లో టీడీపీకి ఎదురైంది. అయితే కాలం ఒక్కలా ఉండదు కదా. ఇపుడు మెల్లగా సీన్ మారుతోంది అంటున్నారు. టీడీపీ నేతల్లో కూడా ధీమా పెరుగుతోంది. దానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా అధికారంలో ఉన్న పార్టీ మీద వ్యతిరేకత ఎంతో కొంత ఉంటుంది. అదే విధంగా మంద ఎక్కువైతే మరానికి చేటు అని అన్ని చోట్లా గెలిచింది వైసీపీ వారే. దాంతో ప్రజల సమస్యలు పెరుగుతున్నాయి. దానికి తగినట్లుగా వైసీపీ నేతలు స్పందించకపోతే జనాలకు కోపమే వస్తుంది.ఇక చూసుకుంటే 2019 ఎన్నికల్లో ఉత్తరాంధ్రాలోని మూడు జిల్లాల్లో వైసీపీ మొత్తం 34 ఎమ్మెల్యే సీట్లకు గానూ 28 గెలుచుకుంది. అలాగే అయిదు ఎంపీ సీట్లు ఉంటే నాలుగు గెలిచి ప్రజా తీర్పు ఏకపక్షమని చాటి చెప్పింది. ఈ మధ్య జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా వైసీపీ జోరు బాగానే సాగింది. కానీ రెండవ విడత కరోనా తరువాత కొంత మార్పు కనిపిస్తోంది. నిత్యావసరాలు పెరగడం, నిరుద్యోగం, అభివృద్ధి లేకపోవడం వంటివి జనాల మీద ప్రభావం చూపిస్తున్నాయి. ఇందులో కొన్ని కేంద్రం తప్పులు అయినా కూడా సామాన్యులకు ఎదురుగా ఉన్నది వైసీపీ కాబట్టి అది ఈ సర్కార్ కే శాపంగా మారుతోంది. దాంతో గత ఎన్నికల్లో ఆరు సీట్లకే పరిమితం అయిన టీడీపీ ఇప్పటికిపుడు ఎన్నికలు జరిగితే మాత్రం ఆ సంఖ్యను రెట్టింపు చేసుకుంటుంది అంటున్నారు. అంటే వైసీపీకి వచ్చిన 28 సీట్లలో ఆరేడు సీట్లు తగ్గిపోతయన్న మాట.వైసీపీ సంస్థాగతంగా పడకేసింది. ఎన్ని పదవులు జగన్ నాయకులకు ఇచ్చినా వారు జనాల్లోకి మాత్రం రావడం లేదు. మూడు జిల్లాల్లో ఎక్కడ చూసినా పార్టీ ఆఫీసులు బోసి పోయి ఉంటున్నాయి. మాకెందుకు అన్నట్లుగానే నేతలు ఉన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు మౌన రాగాలతో అసలు ప్రభుత్వం ఉందా అన్న సందేహం కలిగేలా చేస్తున్నారు. ఇక పధకాల విషయంలో కూడా అందరికీ అందకుండా తర తమ భేదాలు సాగుతున్నాయి. పైన జగన్ రాజకీయాలకు అతీతంగా అంటూ ఎన్ని చెప్పినా దిగువ స్థాయిలో మాత్రం జరగాల్సిన రాజకీయం సాగుతోంది. దీంతో ఉత్తరాంధ్రలో అధికార పార్టీ పట్ల కొంత వ్యతిరేకత పెరుగుతోంది. ఇక ఈ మధ్య కాలంలో ఎంపీ విజయసాయిరెడ్డి కూడా పార్టీని పట్టించుకోవడం మానేశారు. దాంతో వర్గ పోరు కూడా పెరిగిపోతోంది. దీంతో ఇక కచ్చితంగా ఫోకస్ పెట్టాల్సిందే అని అధినాయకత్వం నిర్ణయానికి వచ్చింది అంటున్నారు.కమిటీలు కొత్తగా ఎక్కడికక్కడ వేయడం, ప్రభుత్వ కార్యక్రమాలను విరివిగా ప్రచారం చేసుకోవడం వైసీపీ త్వరగా చేయాల్సిన పని అంటున్నారు. ఇక మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా హనీమూన్ మూడ్ నుంచి బయటకు వచ్చి ప్రజలకు చేరువ కావాలని సూచనలు అందుతున్నాయి. తెలుగుదేశం ఈ మధ్య బాగా రీఛార్జ్ అయింది. ప్రతీ రోజూ ఏదో ఒక నిరసన, ఆందోళనతో జనంలోకి వస్తున్నారు. ప్రెస్ మీట్లు, ప్రకటనలు వీటికి అదనంగా ఉంటున్నాయి. దాంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు చేస్తున్న ప్రచారం జనాల మెదళ్లలోకి వెళ్ళిపోతోంది. దాన్ని కౌంటర్ చేసేలా వైసీపీ వ్యూహాలను రూపొందించుకోవాలని అంటున్నారు. ప్రస్తుతానికి అయితే మెజారిటీ సీట్లు వైసీపీకే ఉన్నాయి. కానీ వైసీపీ ఇలాగే తగ్గి ఉంటే మాత్రం ముందు ముందు భారీ రాజకీయ మార్పు ఉత్తరాంధ్రా నుంచే మొదలవుతుంది అన్న వార్నింగ్ బెల్స్ మోగుతున్నాయి.

# నాగబాబు..దారెటు



ఏలూరు, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)మెగా బ్రదర్ అన్న ట్యాగ్ తో నాగబాబు సినీరంగంలో ఇమేజ్ సంపాదించుకున్నారు. ఆయన అన్న చాటు తమ్ముడు, తమ్ముడి మాటు అన్నగా కూడా కనిపిస్తారు. ఆయన కొణిదెల కుటుంబంలో మధ్యముడు. అన్నా తమ్ముడు చల్లంగా ఉంటే చాలు అనుకునే విశాల హృదయం నాగబాబు సొంతం. ఇక అన్న ప్రజారాజ్యం పార్టీకి ఇంజన్ గా పనిచేసిన నాగబాబు జనసేనలోనూ తనదైన పాత్ర పోషించారు. నర్సాపురం లోక్ సభ నుంచి 2019 ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన బాగానే ఓట్లు సంపాదించారు. చివరి నిముషంలో రాజకీయ ఎంట్రీ ఇచ్చినా కూడా బాగానే ప్రదర్శన ఉందని అంతా అనుకున్నారు. అయితే ఇలా ఓడిపోగానే అలా నాగబాబు రాజకీయ తెర నుంచి అదృశ్యం కావడమే విశేషంగా చూడాలి.నాగబాబు ఎటువంటి ముందస్తు ప్రయత్నం లేకుండా సడెన్ గా నర్సాపురం లోక్ సభ బరిలోకి దిగినా కూడా ఆయనకు రెండున్నర లక్షల ఓట్లు వచ్చాయి. అది సామాన్య విషయం కాదు. జనసేనకు అన్ని ఓట్లు పడ్డాయి అంటే అది మెగా బ్రదర్ మీద జనం చూపించిన ఆదరణగానే చూడాలి. ఇక నాగబాబు కూడా ఆ ఎన్నికలలో అగ్రెస్సివ్ గానే వ్యవహరించారు. అటు జగన్, ఇటు చంద్రబాబులను గట్టిగా విమర్శిస్తూ అనుభవం కలిగిన నాయకుడి మాదిరిగానే సత్తా చాటారు. ఇక గెలిచినా ఓడినా తాను నర్సాపురం జనం మధ్యనే ఉంటాను అని కూడా నాగబాబు చెప్పారు. కానీ రెండున్నరేళ్ళు గడచినా కూడా నాగబాబు అటు వైపు కన్నెత్తి చూడడమే మానేశారు.నాగబాబు ఇపుడు రాజకీయ వైరాగ్యంలో ఉన్నారనే అంటున్నారు. అందుకే ఆయన అటు జనసేన కార్యక్రమాలలో కూడా ఏ మాత్రం చురుకుగా పాల్గొనటంలేదని చెబుతున్నారు. పార్టీ తమ్ముడిది అయినా పెత్తనం వేరొకరిది అన్నట్లుగా అక్కడ సీన్ ఉంది. నిజానికి నాగబాబుకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తే ఆయన ఈ రోజుకీ జనాల్లో ఉండేవారని అంటారు. పవన్ సినిమాలు చేసుకున్నా కూడా క్యాడర్ కి ఉత్సాహమిస్తూ పార్టీ పటిష్టంగా ఉండేలా చేసేవారు అని చెబుతారు. నిజానికి పార్టీ ఓడిన కొత్తల్లో నాగబాబు విశాఖ గోదావరి జిల్లాలలో సమీక్షా సమావేశాలు కూడా నిర్వహించారు. కానీ ఆ తరువాత ఎందుకో ఆయన దూరం అయిపోయారు.ఇక తెలుగుదేశం 2019 ఎన్నికల్లో సీనియర్ నేత వేటకూరి వెకట శివరామరాజుకి టికెట్ ఇచ్చింది. ఆయన నాలుగు లక్షల దాకా ఓట్లు సంపాందించారు. ఇపుడు ఆయనను పక్కన పెట్టి మరీ వైసీపీ తరఫున గెలిచి రెబెల్ గా మారిన కనుమూరి రఘు రామ కృష్ణరాజుకే బాబు మద్దతు ఇవ్వడం తమ్ముళ్లకు కూడా షాక్ గా ఉంది. మరో వైపు నాగబాబుని డైరెక్ట్ గా ఎన్నో విమర్శలు చేసిన రఘురామ ఇపుడు జనసేనాని పవన్ కి కూడా ఆప్తుడుగా మారారు అంటున్నారు. తన సోదరుడు ఓడినా కూడా నర్సాపురం ఎంపీ తమవాడే అన్న ఫీలింగ్ అయితే జనసేనానిలో ఎక్కడో ఉన్నట్లుంది మరి. టీడీపీ తీరు కూడా అదే కావడంతో నాగబాబు ఓడారు అన్నది ఎవరికీ గుర్తుకురావడంలేదు అంటున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో కూడా టీడీపీ జనసేన పొత్తు కుదిరితే టీడీపీ నుంచి రఘురామ మరోమారు ఎంపీగా పోటీ చేసినా చేస్తారు. అందువల్ల నాగబాబు రాజకీయం నర్సాపురంతోనే మొదలై అక్కడే ఆగిపోయింది అనే చెప్పాలి.

# పరవాడ సి.ఐ. పై బదిలీ వేటు

## వీఆర్ కు బదిలీ చేస్తూ సిపి మనీష్ కుమార్ సిన్హా ఆదేశాలు జారీ

విశాఖపట్నం. సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)విధి నిర్వహణలో అలసత్వం వహించారని పరవాడ సి .ఐ ఉమా మహేశ్వర రావు పై బదిలీ వేటు పడింది. ఆయన స్థానంలో గాజువాక క్రైమ్ సిఐ పనిచేస్తున్న .పి సూర్యనారాయణ కు బాధ్యతలు అప్పగించారు. సోమవారం మైలాన్ టెన్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో మునగపాక ప్రాంతానికి చెందిన దొడ్డ శ్రీనివాస్ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దాంతో కంపెనీ గేట్ వద్ద ఆయన కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు ఆందోళనకు దిగారు. మృతి చెందిన వ్యక్తికి అన్నివిధాలా న్యాయం జరగాలని మృతదేహాన్ని కంపెనీ గేటు వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. ఇంత జరుగుతున్నా పరవాడ పోలీసులు పట్టించుకోలేదు. కనీసం ఉన్నతాధికారులు కూడా సమాచారం చేయలేదు. పరవాడ సీఐ సంఘటనా స్థలంలో కాకుండా కంపెనీ ఆవరణంలో సంస్థ ప్రతినిధులతో సుదీర్ఘ చర్చలు జరుగుతుండడంతో అందోళనకారులు పోలీసు ఉన్నతాధికారులకు పిర్యాదు చేసారు. విశాఖ పోలీసు కమిషనర్ మనీష్ కుమార్ సిన్హాతో పాటు డిజిపి కార్యాలయానికి ఫిర్యాదు అందింది. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్న పట్టించుకోకపోవడం, అదే కంపెనీ గేటు మీదగా సుమారు ఏడు కంపెనీల కార్మికుల వెళ్లాల్సి ఉన్నా, ఆ విషయంపై దృష్టి సారించకపోవడం, కంపెనీ ప్రతినిధులు కార్మికుల కాంట్రాక్టర్ల మధ్య సంఖ్యత కుదిర్చేందుకు ప్రయత్నం చేయకపోవడం పై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. దీంతో అక్కడున్న కంపెనీలకు వెళ్లాల్సిన బస్సులను ట్రాఫిక్ విషయంలో నియంత్రించుకోవడం తో అలసత్వం వహించారని అయనను బాధ్యతల నుంచి తప్పించారు.

# శ్రీశైలంలో సాధువుల వేషంలో అన్యమత ప్రచారం?

## ముగ్గురిని అడ్డుకున్న స్థానికులు

శ్రీశైలం సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్) శ్రీశైలం క్షేత్ర పరిధిలో సాధువుల వేషంలో కొందరు అన్యమత ప్రచారం చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. దాని తాలుకు వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. శ్రీగిరి కాలనీలోని నివాసాల వద్ద ముగ్గురు వ్యక్తులు సాధువుల వేషంలో తిరుగుతూ స్థానికు లను "ప్రెయిజ్ ది లార్డ్ అని అనడం స్థానికులు గుర్తించారు. వెంటనే స్పందించి వారిని నిలదీశారు. ఆ సాధువులు మెడలో తులసి మాలలో పాటు అన్యమత చిహ్నాలతో కూడిన చైన్ ధరించినట్లు గుర్తించారు. వారితో ఆ మాలలను తీసివేయించి, క్షేత్ర పరిధిలో ఇలా అన్యమత ప్రచారాలు ఎలా చేస్తారని ప్రశ్నించా.రు ఇలాంటి కార్యక్రమాలు బయట చేసుకోవాలని, వెంటనే క్షేత్రం నుంచి వెళ్లాలని స్థానికులు హెచ్చరించారు. దీనిపై దేవస్థానం సీఎస్వో నరసింహ రెడ్డిని వివరణ కోరగా... ఈ షయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సంఘటనలు శ్రీశైలంలో జరగడం కొత్తేమి కాదు. గతంలోను ఇలాంటివి జరిగాయి. మేము చైసుకుంటాం అనడం అధికారులకు పరిపాటిగా మారిందని స్థానికులు చర్చించుకుంటున్నారు

# లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో జాతీయ ఇంజినీర్స్ డే వేడుకలు

కోరుట్ల సెప్టెంబర్ 15 లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో బుధవారం "జాతీయ ఇంజినీర్స్ డే" ను పురస్కరించుకుని కోరుట్ల పట్టణంలో నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై విశిష్ట సేవలు అందిస్తున్న ఎలక్ట్రికల్ మరియు మున్సిపల్ ఇంజనీర్స్ లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాఎలక్ట్రికల్ శాఖ జక్కుల అమరేందర్ ఏఈ, పీ.రవి ఏఈ , ఏ.అభినయ్ కుమార్, మున్సిపల్ డీఈఈ ఏ.మహిపాల్ ఏఈ, జే.లక్ష్మీ ఏఈ లను ఘనంగా శాలువా మరియు మెమొంటో తో సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల అధ్యక్షులు లయన్ దండంరాజ్ స్వరాజ్ మాట్లాడుతూ జాతీ నిర్మాణంలో ఇంజినీర్స్ పాత్ర ముఖ్యమైనదని , మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు నవీకరణ పద్దతులతో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక పారిశ్రామిక పద్దతులను అన్వయిస్తూ దేశ అభ్యున్నతిలో భాగస్వామ్యం వహిస్తున్న ఇంజినీర్లకు అభినందనలు తెలిపారు.ప్రతీ సంవత్సరం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 15వ తేదీన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పక్షాన దేశవ్యాప్తంగా ఇంజినీర్స్ డే ను జరుపుతామని, దీనిలో భాగంగా పట్టణంలో కరోనా విపత్కర పరిస్థితులలో కూడా పట్టణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విశిష్టమైన సేవలందించిన ఎలక్ట్రిక్ మరియు మున్సిపల్ ఇంజినీర్స్ లను వారి సేవలను గుర్తించి ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ లయన్ మంచాల జగన్, కార్యదర్శి లయన్ బైరి విజయ్ కుమార్, కోశాధికారి లయన్ పొలాస రవీందర్, ఉపాధ్యక్షులు లయన్ గంద్ర అజయేందర్ రావు,లియో ఆమేర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగని చిన్నారులపై లైంగిక దాడి

చిత్తూరు సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)బి.కొత్తకోట లో ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడి జరిగింది. స్థానిక ఇందిరమ్మ కాలనీ లో ఘటన వెలుగు చూసింది. అనిల్ (20) అనే యువకుడు ఈ దారుణానికి ఒడిగట్టాడని గుర్తించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చిన్నారులను మిద్దెపైకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధిత చిన్నారులు బి.కొత్తకోట ఇందిరమ్మ కాలనీలో అమ్మమ్మ వద్ద ఉంటున్నారు. చిన్నారులు కేకలు వేయడంతో స్థానికులు గుర్తించి యువకుడిని పట్టుకుని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసారు. నిందితుడు గత కొద్దిరోజులుగా కాలనీలో చిన్నారులను వేధిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు బి.కొత్తకోట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

# రాష్ట్రం లో అభివృద్ధి కుంటిపడింది

విశాఖపట్నం సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)రాష్ట్ర ప్రభుత్వం తన వాటా పెట్టుబడులు పెట్టక పోవడం వలన కేంద్ర నిదులు సద్వినియోగం చేసుకోలేక పోతున్నామని, రాష్ట్రం లో అభివృద్ధి కుంటిపడిందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహం విమర్శించారు. విశాఖ బీజేపీ ప్రధాన కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం సినిమా టికెట్ ల అమ్మకం ద్వారా రాబోయే ముప్పై సంవత్సరాలు లో వచ్చే ఆదాయం పై అప్పు తెచ్చే పరిస్థితి వుందని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో సినిమా లు కూడా తీస్తారేమో అని అనుమానాన్ని వ్యక్తం చేశారు. మటన్ మార్ట్ లు, ఫిష్ అవుట్ లెట్ లు పెట్టడం వలన సామాన్య వ్యాపారుల ఉపాది కోల్పోయే పరిస్థితి వుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ తో పాటు దేశ వ్యాప్తంగా అనేక ప్రభుత్వ రంగ సంస్థలు ను క్రమేపీ ప్రైవేటు పరం చేస్తున్నామన్నారు. అవకాశం వుంటే స్టీల్ ప్లాంట్ ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయవచ్చు అని సూచిం చారు. విశాఖ రైల్వే జోన్ త్వరలోనే కార్యరూపం దాలుస్తోందని. దీనిపై ఇప్పటికే రైల్వే శాఖ విభాగాధిపతులను కలిసి, సమస్యలు వివరించామని తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఆగని నేరాలు



విజయవాడ, హైదరాబాద్, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)లంగాణ రాష్ట్రంలో గతేడాది నేరాల సంఖ్య గణనీయంగా పెరిగింది. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో(ఔఅఖీః) నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం.. 2020 సంవత్సరంలో తెలంగాణ వ్యాప్తంగా 12 శాతం నేరాలు పెరిగాయి. రాష్ట్రంలో గతేడాది మహిళపై లైంగిక వేదింపులకు సంబంధించి 4,907 కేసులు నమోదు అయ్యాయి. ఇలా మహిళలపై లైంగిక దాడులు, హత్యలు, దోపిడీలు, వంటి కేసులు భారీగా నమోదు అయ్యాయి.ఆంధ్రప్రదేశ్‌లో నేరాల సంఖ్య పెరుగుతూ పోతోంది. ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడుతున్నామని చెబుతున్నప్పటికీ ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం 2019తో పోలిస్తే 2020లో నేరాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఏకంగా 63శాతం మేర పెరిగాయంటే మామూలు విషయం కాదు. జాతీయ స్థాయిలోనూ పెరిగాయి.అయితే ఆ సగటు 23 శాతం మాత్రమే ఉంది. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుపై తీవ్రమైన విమర్శలు వస్తున్న సమయంలో ఈ నివేదిక వెలుగులోకి రావడం చర్చనీయాంశం అవుతోంది.2019లో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 1 లక్షా 45, 751 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఐపీసీతో పాటు స్థానిక చట్టాల కింద నమోదైన కేసులు ఉన్నాయి. అదే 2020లో ఈ కేసుల సంఖ్య 2 లక్షల 38వేల 105కి చేరింది. అంటే దాదాపుగా ఒక్క ఏడాదిలోనే లక్ష కేసులు అదనంగా నమోదయ్యాయి. స్థానిక చట్టాలపై నమోదైన కేసులను తీసేసి.. ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ల కింద నమోదు చేసిన కేసులను చూసినా 58 శాతానికిపైగా కేసుల నమోదు ఉంది. ఇది దేశంలో అత్యధిక వృద్ధి. దేశంలో అత్యధిక నేరాలు జరుగుతున్న రాష్ట్రాల జాబితాలో 2019లో ఏపీ 12వ స్థానంలో ఉండేది. ఈ ఏడాది మూడు స్థానాలు పెరిగి 9వ స్థానానికి వచ్చింది. దేశంలో అతి పెద్ద రాష్ట్రాల్లో జరగనన్ని నేరాలు , ఘోరాలు ఏపీలో జరుగుతున్నాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించినట్లయింది. ఏపీలో ఘోరం జరగని రోజంటూ ఉందా !? ఆంధ్రప్రదేశ్‌లో ఘోరం జరగనిరోజు ఉండటం లేదు. చిన్నపిల్లలు, మహిళలు, రాజకీయ దాడులు, రాజకీయ కేసులు ఇలా ఏదో ఒక అంశంతో అలజడి రేగుతూనే ఉంది. వందల కొద్దీ కేసులు పెడుతూనే ఉంది. సంచలనం సృష్టించిన ఘటనల్లో బాధితులకు ప్రజాధనాన్నే పరిహారంగా ఇస్తున్న ప్రభుత్వం నిందితులకు శిక్షలు విధించడంలో మాత్రం ఆసక్తి చూపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఏపీలో నేరాలు చేయాలన్న వారికి ధీమా దొరుకుతోందని ఆ ప రిస్థితికి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికలే కారణమన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం, పోలీసుల వైఫల్యం వల్ల నేరగాళ్ల గుప్పిట్లోకి ప్రజలు ! పోలీసులు పూర్తిగా రాజకీయ పరమైన విధి నిర్వహణకు అంకితమైపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ పరమైన కేసులు పెట్టి ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడానికి తప్ప ఇక దేనికీ వారు పని చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సాక్షాత్తూ డీజీపీనే ప్రతిపక్షాలు అంటూ మాట్లాడటం వివాదాస్పదమయింది. కారణం ఏదైనా అటు పోలీసుల వైఫల్యమో.. ఇటు ప్రభుత్వ స్వార్థమో కానీ? ప్రజలు మాత్రం నేరగాళ్ల గుప్పిట్లో చిక్కుకున్నారని.. రాష్ట్రం నేరాంధ్రప్రదేశ్ అయిందన్న ఆరోపణలకు బలం చేకూర్చేలా ఈ నివేదిక ఉంది.

తెలంగాణలో నేరాల వివరాలు..

రాష్ట్రంలో 2020 సంవత్సరంలో 12 శాతం నేరాలు పెరిగాయి.

వాటిలో మహిళల పై లైంగిక వేధింపుల కేసులు ? 4,907

చిన్నారులపై లైంగిక దాడులు, పోక్సో కేసులు ? 2,074

మహిళలపై దాడుల కేసులు ? 2,520

హైదరాబాద్ వ్యాప్తంగా రేప్ కేసులు ? 92

తెలంగాణ వ్యాప్తంగా రేప్ కేసులు ? 764

బహిరంగంగా మహిళలను వేధించిన కేసులు ? 21

సైబర్ స్టాకింగ్ ద్వారా మహిళల్ని వేధించిన వారిపై కేసులు ? 1,436

చిన్నారుల మిస్సింగ్ కేసులు ? 420

మహిళలు వరకట్న వేదింపులు తాలలేక ఆత్మహత్యకు పాల్పడిన కేసులు ? 158

తెలంగాణ వ్యాప్తంగా హత్య కేసులు ? 802

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ? 117

నిర్లక్ష్యం కారణంగా మరణించిన కేసులు ? 7,564

రోడ్డు ప్రమాదాల్లో మరణించిన కేసులు ? 7,226

హిట్ అండ్ రన్ కేసులలో మరణించిన వారు ? 1,365

మహిళలపై యాసిడ్ దాడి కేసులు ? 5

ముఖ్య గమనిక: ఈ కేసులన్నీ ఒక్క 2020 సంవత్సరంలో నమోదైనవి మాత్రమే.

# డాక్టర్, వైద్య సిబ్బందిపై రోగి బంధువుల దాడి

గుడివాడ సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)గుడివాడ ఏరియా హాస్పిటల్ లో డాక్టర్,సిబ్బంది పై దాడి జరిగింది. చేసిన సంఘటన. అక్కడికి చికిత్స కోసం వచ్చిన ఒక గర్భిణీ తాలుకు బంధువులు ఈ దాడికి పాల్పడ్డారు. కృష్ణా జిల్లా గుడివాడ చౌదరిపేట కు చెందిన గర్భిణీ పిల్లి హారిక ను గుడివాడ ఏరియా హాస్పిటల్ కి బుధవారం ఉదయం 5 గంటలకు తీసుకువచ్చారు. అయితే, రోగిని డాక్టర్లు, సిబ్బంది పట్టించుకోలేదు హారిక బంధువులు ఆరోపించారు. ఆమె పరిస్థితి విషమించడతో వారు హాస్పిటల్ లో అద్దాలు పగలకొట్టి డ్యూటీ డాక్టర్,సిబ్బంది పై దాడికి పాల్పడ్డారు. రోగిని ఉదయం 5 గంటలకు పేషెంట్ ని తీసుకు వస్తే 7 గంటల వరకు డాక్టర్ లు చూడకుండా అశ్రద్ధ వహించి విజయవాడ హాస్పిటల్ కి తీసికెళ్లమన్నారని వారి ఆరోపణరక్తస్రావం అధికంగా వుండడంతో తల్లిబిడ్డలకు ప్రాణహాని ఉందని డ్యూటీ డాక్టర్ చెప్పటం తో బంధువులు దాడికి దిగారు. హాస్పిటల్ అద్దాలు పగలకొట్టి, సిబ్బంది పై మాపై దాడికి దిగారు అని గైనకాలాగిస్ట్ డాక్టర్ మాధురి పేర్కొన్నారు. డాక్టర్ మాధురి మాట్లాడుతూ ఉదయం 5 గంటలకు హారిక అనే గర్భవతిని బాగా బ్లీడింగ్ తో హాస్పిటల్ కి తీసుకు వచ్చారు. పేషెంట్ కి బాగా బ్లీడింగ్ మరియు బేబీ అడ్డనీ తిరగటం తో పరిస్తితి విషమించింది అని విజయవాడ కు ప్రిఫర్ చేసాను అన్నారు. విజయవాడ ప్రిఫర్ లెటర్ ఇచ్చే సమయానికి వారి బంధువులు దాడి చేశారని డాక్టర్ స్పష్టం చేశారు. హాస్పిటల్ డాక్టర్ ని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, వన్ టౌన్ సిఐ గోవిందరాజు జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు..

# ముంబాయికి స్పైస్ జెట్ విమానాలు

విశాఖపట్నం సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)స్పైస్ జెట్ సంస్థ ప్రయాణి కుల సౌలభ్యం కోసం మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొనివచ్చింది. విశాఖపట్నం విమానాశ్రయం ఆవర ణలో స్పైస్ జెట్ విమానం విశాఖ పట్నం నుండి ముంబై కు వెళ్లే ఫ్లైట్ ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్నారు. విశాఖపట్నం ను పరిపా లన రాజధాని గా ఏర్పాటు చేయనున్న తరుణంలో విశాఖ పట్నం, విజయ నగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల కోసం సులభ తరమైన ప్రయాణాల అనుకూలంగా సంస్థలు ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

# భరద్వాజ తీర్థం (లోబావి) నందు మృతదేహం ఖననం

చిత్తూరు సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి కూత వేటు దూరంలో ఉన్న భరద్వాజ తీర్థం (లోబావి) లో వెలసిన భరద్వాజేశ్వరాలయం వద్ద వ్యక్తిని ఖననం చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నెల్లూరు జిల్లా నాయుడుపేటకు చెందిన లోకేష్ అనే వ్యక్తి (34) మృతదేహాన్ని సోమవారం ఇక్కడకు తీసుకువచ్చి ఆలయం పక్కన ఖననం చేశారు. ఆ వ్యక్తి ఎవరు..? నాయుడుపేట నుంచి ఇక్కడకు తీసుకురావాల్సిన అవసరం ఏముంది..? అయినా భరద్వాజేశ్వరాలయం పక్కన సమాధి చేయడం ఎంత వరకు సమంజసం..? స్థానికేతర వ్యక్తికి ఎవరు అనుమతి ఇచ్చారనేది సమాధానం లేని ప్రశ్నలుగా మిగిలిపోయాయి. భరద్వాజ మహర్షి తపస్సు చేసిన దివ్య ప్రదేశంగా ఇక్కడి ప్రాంతం పవిత్రతను సంతరించుకుంది. ఏళ్ల క్రితం ఇక్కడే ఉంటూ భగవంతుని సేవించుకుంటూ అవధూతలుగా ఉంటున్న భక్తులను ఇక్కడ సమాధి చేశారు. అది జరిగింది కూడా ఏళ్ల క్రితం. అయితే ప్రస్తుతం బయటి వ్యక్తుల మృతదేహాలను ఇక్కడ ఖననం చేసేందుకు వీలు కాదు. ఎక్కడో నాయుడుపేటకు చెందిన వ్యక్తి గతంలో ఇక్కడ అవధూతగా ఉంటూ వచ్చిన కోట్లమ్మ శిష్యుడని చెప్పి ఇక్కడకు తీసుకువచ్చి ఖననం చేయడం విమర్శలకు కారణం అవుతోంది

# ఈ నెల 18 న నరసరావుపేట లో రైతు గర్జన సభ

గుంటూరు సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)నరసరావుపేట టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగలో జివి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం కళ్ళు తెరిపించేందుకే రాష్ట్ర వ్యాప్తంగా రైతు గర్జనలకి పిలుపునిచ్చాం. రైతులకు కేటాయించిన ఐదు వేల కోట్లు ఎక్కడికెళ్లయి. రైతు ఆత్మహత్యలలో దేశంలోనే రెండవ స్థానంలో ఏపీ ఉండటం సిగ్గుచేటు. ఇప్పటికీ నాలుగు వేల కోట్లు రైతులకు ధాన్యం బకాయిలు ఉన్నాయి. నీళ్లను ఎలా కొలుస్తారో కూడా తెలియని వ్యక్తి ఈ రాష్ట్రానికి ఇరిగేషన్ మినిస్టర్ అయ్యాడని అన్నారు. పెరిగిన రేట్లతో నష్టాలు భరించలేక రైతులు పట్నాలకి వెళ్లి కూలి పనులు చేసుకునే దుస్థితి ఏర్పడింది. రాష్ట్రం మొత్తం నకిలీ విత్తనాలు,ఎరువులు మాఫియా ని వైసీపీ నేతలే నడుపుతున్నారు

# కాలువలోకి దూసుకుపోయని బస్సు

నూజివీడు సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)కృష్ణాజిల్లా నూజివీడు నుండి ఎర్రగొండపాలెం వెళుతున్న ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. బస్సు ముందు ఫ్రంట్ టైర్ పేలడంతో బస్సు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఘటన జరిగినప్పుడు బస్సులో సుమారు 30 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. డ్రైవర్ చాకచక్యంతో ఆపడం తో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. .

# నెల్లూరులో దారుణం

## మహిళను చితకబాదిన వైనం

నెల్లూరు సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)మహిళ పై దారుణం గా ఒక వ్యక్తి దాడికి దిగాడు. విచక్షణా రహితంగా చేత్తో, కర్రతో దాడి చేసాడు. సదరు వీడియో ఇప్పుడు వైరల్ అయింది. వీడియోలో దాడికి పాల్పడ్డ వ్యక్తి ప్రక్కన ఉన్న మరో వ్యక్తికి శారీరక వాంఛలు తీర్చాలని బెదిరించాడు. ఆ యువతి తన వల్ల కాదని బ్రతిమిలాడుతున్నా కసాయి కనికరించలేదు. తతంగాన్ని వీడియో తీయించి పైశాచిక ఆనందం పొందాడు. ఈ వీడియో ఎక్కడిది,ఎప్పటిది,వీడియోలో ఉన్నది ఎవరనే దాని పై పోలీసుల ఎంక్వయిరీ చేస్తున్నారు. నెల్లూరు రామకోటయ్య నగర్ ఏరియాలో ఈ ఘటన జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. వీడియో లో ఉన్న వ్యక్తి,మహిళ ను ఇప్పటికే పోలీసులు గుర్తించినట్టు సమాచారం. నెల్లూరు శివారు ప్రాంతాలు మహిళల పై అఘాయిత్యలకు అడ్డాగ మారాయని అందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

# సీసీ రోడ్లు మురికి కాలువలను ప్రజలకు అంకితం చేసిన : యమ్ యల్ ఏ శిల్ప రవి చంద్ర కిషోర్ రెడ్డి



నంద్యాల సెప్టెంబర్ 15, (( విభారె) ) నంద్యాల పట్టణంలో బుధవారం నాడు 20.5 లక్షల రూపాయల వ్యయంతో 32 వ వార్డులో అభివృద్ధి పనులు.16 లక్షల.50 వేల రూపాయల వ్యయంతో నిర్మించిన సి సి రోడ్డు మురుగు కాల్వల ను ప్రారంభించిన నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి.నంద్యాల సెప్టెంబర్ 15:-16 లక్షల.50 వేల రూపాయల వ్యయంతో నిర్మించిన సి సి రోడ్డు మరియు మురుగు కాల్వల ను నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించినారు.బుధవారం పట్టణంలోని 32వ వార్డులో రహదారులు మరియు భవనాల శాఖ విశ్రాంతి భవనం నుండి డీఎస్పీ కార్యాలయం వరకు 16 లక్షల.50 వేల రూపాయల వ్యయంతో నిర్మించిన సి సి రోడ్డు మరియు మురుగు కాల్వల ను నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి . నంద్యాల పురపాలక సంఘం అధ్యక్షురాలు షేక్ మాబున్నిసా. పురపాలక సంఘం ఉపాధ్యక్షులు గంగిశెట్టి వెంకట నాగ శ్రీధర్. మరియు పామ్ షావలి. మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణ లతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించినారు.నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణం లోని 32 వ వార్డులో పురపాలక సంఘ సాధారణ నిధుల నుండి 20.5 లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేశాం అని అన్నారు. 16 లక్షల.50 వేల రూపాయల వ్యయంతో నిర్మించిన సి సి రోడ్డు మురుగు కాల్వల ను ప్రారంభించుకున్నా మని అన్నారు . గతములో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి డీఎస్పీ ఆఫీస్ కి వెళ్లే రహదారిలో వీధి దీపాలు లేకుండా ఉండేవని దీనిని దృష్టిలో పెట్టుకుని నాలుగు లక్షల రూపాయల వ్యయంతో వీధి దీపాల కొరకు మూడో వ లైన్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు నంద్యాల పట్టణంలోని ప్రధాన రహదారులు కాకుండా అంతర్గత రహదారులు కూడా నిర్మించుకొని నంద్యాల ను సుందరీకరణ పట్టణంగా తీర్చి దిద్దుకుందామన్నారు. పట్టణంలోని డ్రైనేజీ నిర్వహణల పై పురపాలక సంఘం అధ్యక్షురాలు షేక్ మాబున్నిసా. మున్సిపల్ ఇంజనీర్. రహదారులు మరియు భవనాల శాఖ ఈఈ సురేష్ బాబులతో కలిసి సమన్వయ సమీక్ష నిర్వహించామని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి అన్నారు.అనంతరం శాసన సభ్యులు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం ప్రాంతంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద డ్రైనేజీలు నిర్మించాలని అదేవిధంగా పురపాలక సంఘం కార్యాలయం ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను సంబంధిత గుత్తేదారుల తో మాట్లాడి పనులను పూర్తి చేయించాలని సంబందిత అధికారులను ఆదేశించామని శాసనసభ్యులు అన్నారు. నంద్యాల పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్ నుండి ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతం వరకు ఉన్న డ్రైనేజీ లలో కొంతమంది వ్యాపారస్తులు డ్రైనేజీ లను ఆక్రమణ చేసి వాటిపైన పర్మనెంట్ స్ట్రక్చర్ చేస్తున్నారు అలా కాకుండ డ్రైనేజీ లను శుభ్రపరచు కొనుటకు వీలుగా ఉండేలా ఉంచుకోవాలని డ్రైనేజీ లను పూడిక తీసుకుంటు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వీరి వెంట మున్సిపల్ కౌన్సిలర్లు. కో ఆప్షన్ సభ్యులు. తదితరులు ఉన్నారు.

# లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రిలే దీక్షలు

## లౌకిక రాజ్యంగా పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ మౌలానా ముస్తాక్ అహ్మద్

నంద్యాల సెప్టెంబర్ 15, (( విభారె)- నంద్యాల పట్టణంలో బుధవారం లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ మౌలానా ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ రేపు అనగా 16 నుంచి 27 వ తేదీ వరకు రిలే దీక్షలు చేపడుతున్నారని వారు తెలిపారు.పెంచిన విద్యుత్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలిని డిమాండ్ చేశారు.వంట గ్యాస్ పెట్రోలు డీజిల్ రేట్ లను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. ఇంటి ,చెత్త ,కుళాయి, మురుగుకాలువ పన్ను ,రాష్ట్ర ప్రభుత్వం తక్షణవే ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేశారు.విద్యుత్ వ్యవసాయ బిల్లును రద్దు చేయాలిని డిమాండ్ చేశారు.. ఈ దీక్షలకు తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ దీక్షలకు మద్దతుగా టిడిపి నంద్యాల పార్లమెంట్ కార్యదర్శి యన్ యమ్ డి పిరోజ్ మద్దతు తెలుపుతారని వారు అన్నారు .ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ ,ఆవాజ్ జిల్లా కన్వీనర్ మస్తాన్ వలి. జేయు యమ్ యల్ , జిల్లా కార్యదర్శి సలాం మౌలానా ,పీడియస్ యు . జిల్లా సహాయ కార్యదర్శి రఫీ,లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నంద్యాల డివిజన్ నాయకులు ఇస్మాయిల్, ఖాజా ఫరీద్ ,జకీర్, తదితరులు పాల్గొన్నారు.



# డిసెంబర్లో మార్కెట్లోకి పంచగవ్య ఉత్పత్తులు

## ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఈవో ఆదేశం

తిరుపతి,సెప్టెంబర్ 15, (( విభారె) తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో తయారు చేయనున్న 15 రకాల పంచగవ్య ఉత్పత్తులను ఈ ఏడాది డిసెంబర్ లో మార్కెట్లోకి ప్రవేశ పెట్టడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని టీటీడీ ఈవో డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలనా భవనం లోని తన చాంబర్లో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ఆయుష్ శాఖ నుంచి పంచగవ్య ఉత్పత్తులకు లైసెన్సులు పొందే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు ఈ లోపు ఉత్పత్తుల అమ్మకాలకు సంబంధించిన డిజైన్ లు కూడా సిద్ధం చేసుకోవాలని ఆయన చెప్పారు. ముడి పదార్థాల సేకరణ, యంత్రాలను సిద్ధం చేసుకుని యంత్రాల ఏర్పాటుకు అవసరమయ్యే విద్యుత్, ఇంజనీరింగ్ పనులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కోయంబత్తూర్ కు చెందిన ఆశీర్వాద్ ఆయుర్వేద ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో కుదిరిన ఒప్పందం మేరకు, సదరు సంస్థ 10 సంవత్సరాల పాటు ఆయుర్వేద ఉత్పత్తులు తయారుచేసి టీటీడీకి అందజేస్తుందని ఈవో వివరించారు. ఫ్లోర్ క్లీనర్, సోపులు, షాంపూ, దంత మంజనం పౌడర్, ఆయుర్వేద అగరబత్తులు లాంటి ఉత్పత్తులు ఉంటాయని తెలిపారు. వీటిలో టీటీడీ వాడగా, మిగిలినవి విక్రయాలకు పెట్టేలా ఏర్పాట్లు చేయాలన్నారు. టీటీడీ ఆయుర్వేద ఫార్మసీ నుంచి 70 రకాల గో ఆధారిత ఉత్పత్తుల తయారీకి సంబంధించి ఆయుష్ వద్ద లైసెన్సులు పొందే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలన్నారు. ఆయుర్వేద ఫార్మసీ లో ఇప్పటికే 115 రకాల మందులు తయారు చేస్తున్నట్లు ఈవో చెప్పారు. అనంతరం ఈవో గోసంరక్షణ శాల అధికారులతో మాట్లాడుతూ, తిరుపతిలోని గోశాల నుంచి భాకరాపేట, పలమనేరు లోని గోశాలలకు గోవుల తరలింపు ప్రక్రియ పది రోజుల్లో పూర్తి కావాలన్నారు. అలాగే పలమనేరు గోశాల నుంచి కొన్ని గోవులను తిరుపతి గోశాలకు తరలించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. గిర్ ఆవుల కొనుగోలు కోసం కమిటీ ఈనెలాఖరు లోపు గుజరాత్ వెళ్లి గిర్ ఆవుల కొనుగోలుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలన్నారు. తిరుపతి లోని గోశాలలో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ నిర్మాణానికి త్వరగా టెండర్లు పిలవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ కృష్ణ, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, చీఫ్ ఇంజినీర్ శ్రీ నాగేశ్వర రావు, పశువైద్య విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రవి, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్ టెన్షన్ ప్రొఫెసర్ వెంకట నాయుడు సమావేశంలో పాల్గొన్నారు.

# సైకిల్ యాత్ర ఎలమర్తి మధు..

నందికొట్కూరు సెప్టెంబర్ 15, (( విభారె) )) రాష్ట్ర బుడగ జంగం అధ్యక్షులు ఎలమంర్తి మధు సైకిల్ యాత్ర మూడు రోజులు కొనసాగిందని బుధవారం నాడు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15-09-2021 3వ రోజు సైకిల్ యాత్ర కడపజిల్లా పులివెందుల నుండి కమలాపురం వరకు 63 కిలోమీటర్లు చేరుకోవడం జరిగింది.కమలాపురం గ్రామంలో రాష్ట్ర, జిల్లా నాయకులు మరియు కమలాపురం ప్రజలు సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.....ఈ మూడు రోజులకి మొత్తం 150 కిలోమీటర్ల సైకిల్ యాత్ర పూర్తి చేయడం జరిగింది.ఈరోజు ఉదయం 8:00 గంటలకు మళ్ళీ కమలాపురం నుండి సైకిల్ యాత్ర మొదలుఅవ్వడం జరిగంది. బుధవారం సాయంత్రం కి కడప సబ్ జైలు దాటి ముందుకు కొనసాగుతుందని ఎలవర్తి మధు అన్నారు రు. కమలాపురం అడ్డురోడ్డు దగ్గర ఉన్న డా":ఖీ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.సైకిల్ యాత్రలో రాష్ట్ర అధ్యక్షుడు ఎలమర్తి.మధు బేడా బుడ్గ జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు సిరిగిరి. మన్నెం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు జంపు.చంద్రశేఖర్ రాష్ట్ర మహిళాధ్యక్షరాలు ఐం లత గారుజిల్లా అధ్యక్షులుమోతే.పెద జమ్మయ్య మరియు రాష్ట్ర,జిల్లా నాయకులు,ప్రజలు పాల్గొన్నారు. వోతి. గౌరీశ్వరరావు(విశాఖపట్నం)



# విఫలమైన కేసిర్ ప్రభుత్వంఅత్యాచారం చేసిన పాల్పడిన వారిని వెంటనే ఎంకౌన్టర్ చేయండి

కౌతాళం సెప్టెంబర్ 15, (( విభారె) ): అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి ఎన్కౌంటర్ చేయాల ని ఎఐఎస్ ఎఫ్ కార్యదర్శి కుమార్ పేర్కొన్నారు.ఏఐఎస్ఎఫ్ కౌతాళం కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో ర్యాలీ చేయబడినది. ఆ ఆరేళ్ళ చిన్నారి చైత్ర పై మూడురోజుల క్రితం అత్యాచారం చేసి దారుణంగా హత్య చేశారు. వారిని కఠినంగా శిక్షించాలని విద్యార్థులు భారీ ఎత్తున ర్యాలీ మరియు మానవహారం వైయస్సార్ సర్కిల్ వరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ ఇంత అరాచకానికి పాల్పడ్డ నిందితుల్ని ఉరిశిక్ష వేయాలని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఇందులో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉపేంద్ర, అంజి, మేఘనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.




# థియేటర్లేనా.. థ్రిల్లివ్వడంలో ఓటీటీ ఎక్కడా తగ్గదు!




నిన్న.. మొన్నటివరకూ ఓటీటీ బాట పట్టిన సినిమాలు ఇప్పుడు థియేటర్ రిలీజ్ కు రెడీ అవుతున్నాయి. ఓటీటీతో పాటు థియేటర్లోనే సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. నిర్మాతలు ఎవరి ఇష్టం మేరకు రిలీజ్ వేదికల్ని ఎంపిక చేసుకుంటున్నారు. కంటెంట్ ఏదైనా ప్లాట్ ఫామ్ తో సంబంధం లేకుండా ఆ సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. తాజాగా ఈ వారంలో ఓటీటీ థియేటర్లో రిలీజ్ అయ్యే సినిమాల గురించి ఓ లుక్ వేస్తే..సందీప్ కిషన్- నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'గల్లీరౌడీ'. ఈ చిత్రానికి జి.నాగేశ్వరరెడ్డి దర్శకత్వం వహించారు. అన్ని పనులు పూర్తి చేసుకున్న సినిమా సెప్టెంబర్ 17న థియేటర్లో రిలీజ్ అవుతుంది. ఈ సినిమా ప్రచార చిత్రాలు ఇప్పటికే ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. దీంతో సినిమాపై అంచనాలు బాగానే ఉన్నాయి. యంగ్ హీరో సందీప్ కిషన్ సరైన సక్సెస్ అందుకుని చాలా కాలమవుతోంది. ఈ నేపథ్యంలో విజయం అనివార్యమైన సమయం కూడా ఇది. సక్సెస్ అతని ఫేట్ ని మార్చే అవకాశం ఉంది. ఇక 'బిచ్చగాడు' ఫేం విజయ్ ఆంటోనీ నటించిన చిత్రం 'విజయ్ రాఘవన్'. ఆనంద్ కృష్ణన్ దర్శకత్వం వహించారు.విజయ్ సినిమాలకు తెలుగులో మంచి మార్కెట్ ఉంది. అతని కంటెంట్ కి టాలీవుడ్ ఆడియన్స్ కనెక్ట్ అవుతుంటారు. ఈ నేపథ్యంలో సినిమాకి మంచి టాక్ వస్తే గనుక విజయ్ కెరీర్ కి ప్లస్ కానుంది. సెప్టెంబర్ 17న థియేటర్లో రిలీజ్ అవుతుంది. ఇదే రోజున మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్- యాక్షన్ కింగ్ అర్జున్ నటించిన 'ఫ్రెండ్ షిప్' కూడా రిలీజ్ అవుతుంది. సింగ్-కింగ్ ల ఫ్రెండ్ షిప్ స్టోరీ నేపథ్యంలో అంచనాలు బాగానే ఉన్నాయి. జాన్ పాల్ రాజ్-శ్యామ్ సూర్య దర్శకత్వం వహించారు. ఇక ఓటీటీలో యూత్ స్టార్ నితిన్ నటించిన 'మాస్ట్రో' కూడా సెప్టెంబర్ 17న రిలీజ్ అవుతుంది. డిస్నీ హాట్ స్టార్ లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది.ఇందులో తమన్నా.. నభా నటేష్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించారు. కోలీవుడ్ హీరో విజయ్ సేతుపతి నటించిన అనబెల్ సేతుపతి కూడా ఇదే రోజున డిస్నీ హాట్ స్టార్ లో రిలీజ్ అవుతుంది. ఇందులో తాప్సీ హీరోయిన్ కాగా... దీపక్ సుందరరాజన్ దర్శకత్వం వహించారు. అలాగే సుశాంత్-మీనాక్షి చౌదరి జంటగా నటించిన 'ఇచట వాహనములు నిలుపరాదు' చిత్రం కూడా సెప్టెంబర్ 17న ఆహాలో రిలీజ్ అవుతుంది. ఇంకా మరికొన్ని హాలీవుడ్ కి చెందిన చిత్రాలు కూడా రిలీజ్ అవుతున్నాయి.'డోర్ అండ్ మీ'.. 'అన్ హియర్డ్'..'కన్ఫెషన్స్ ఆఫ్ ఏ షోఫాహోలిక్'.. 'అన్ కహీ కహానియా'.. 'ప్రియురాలు' చిత్రాలు సెప్టెంబర్ 17న వివిధ ఓటీటీ ప్లాట్ ఫామ్ ల్లో రిలీజ్ అవుతున్నాయి. అలాగే 'వీడ్స్'..'నైట్ బుక్స్'.. సెప్టెంబర్ 15న ..'సెర్చింగ్' సెప్టెంబర్ 14న.. 'అజ్ ఎబౌ సో బిలో'..' బుక్ మై షో' చిత్రాలు సెప్టెంబర్ 16న ఓటీటీల్లో రిలీజ్ అవుతున్నాయి. అలాగే 'సర్వైవర్' అనే రియాల్టీ షో నెట్ ఫ్లిక్స్ లో సెప్టెంబర్ 17న రిలీజ్ అవుతుంది.ఇటీవలి కాలంలో థియేట్రికల్ రంగానికి ఓటీటీ రంగానికి నడుమ అనివార్యమైన పోటీ నడుస్తోంది. ఈ వార్ లో ఓటీటీలు గట్టి పట్టు పట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీనివల్ల ఎగ్జిబిషన్ రంగం తీవ్ర సంక్షోభంలో పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

# నితిన్ కెరీర్ లో ఫస్ట్ టైమ్ ఈ ప్రయోగం

యంగ్ హీరో నితిన్ కరోనా కాలం లో కూడా రెగ్యులర్ గా సినిమాలను విడుదల చేశాడు. గత ఏడాది భీష్మ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నితిన్ ఈ ఏడాది చెక్ మరియు రంగ్ దే సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేశాడు. ఈ వారంలో మాస్ట్రో సినిమాతో ఓటీటీ ద్వారా రాబోతున్నాడు. ఇక వచ్చే ఏడాదికి కూడా బ్యాక్ టు బ్యాక్ సినిమాలను నితిన్ రెడీ చేస్తున్నాడు. తాజాగా వినాయక చవితి సందర్భంగా నితిన్ కొత్త సినిమా టైటిల్ ను 'మాచర్ల నియోజక వర్గం' గా ప్రకటించారు.



రాజశేఖర్ రెడ్డి ఎంఎస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో హీరోయిన్ గా ఉప్పెన బ్యూటీ కృతి శెట్టిని నటింపజేస్తున్నారు. భారీ స్థాయిలో అంచనాలున్న ఈ సినిమాలో నితిన్ ఐఏఎస్ అనే వార్తలు మొదట వచ్చాయి. తాజాగా మరో ఇంట్రెస్టింగ్ పుకారు సోషల్ మీడియాలో షికారు చేస్తోంది.నితిన్ కెరీర్ లో ఇప్పటి వరకు చేయని ఒక పక్కా ఫుల్ లెంగ్త్ పొలిటికల్ డ్రామాను ఈ సినిమాలో చూపించబోతున్నారట. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం సినిమా కథ పూర్తిగా రాజకీయం చుట్టు తిరుగుతుందట. ఈమధ్య కాలంలో టాలీవుడ్ లో కూడా ఇలాంటి పొలిటికల్ బ్యాక్ డ్రాప్ తో సినిమా వచ్చిందే లేదని.. అందుకే ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుంది అనే నమ్మకంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. నితిన్ పొలిటీషియన్ ఆ కనిపిస్తాడని కొందరు అంటూ ఉంటే మరి కొందరు మరో రకంగా ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి ఒక మాస్ పాత్రలో ఆయన కనిపించబోతున్నాడని ఫస్ట్ లుక్ చూస్తుంటే అర్థం అవుతుంది.సినిమాలో నితిన్ ఏంటీ.. కథ ఏంటీ అనే విషయాలు చాలా ఆసక్తిని కలిగిస్తున్నాయి. కనుక సినిమా ను ఎప్పుడెప్పుడు విడుదల చేస్తారా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకునేలా స్క్రీన్ ప్లే మరియు నితిన్ పాత్ర ఉంటుందని యూనిట్ సభ్యుల్లో కొందరు అంటున్నారు. నితిన్ మరియు కృతి శెట్టిల మధ్య లవ్ ట్రాక్ కూడా చాలా విభిన్నంగా ఉంటుందని అంటున్నారు. ఖచ్చితంగా ఇది ఒక మంచి పొలిటికల్ డ్రామాగా నిలుస్తుందని మేకర్స్ అంటున్నారు. కథ విషయంలో చాలా ఇంట్రెస్ట్ ఉండటం వల్ల నితిన్ స్వయంగా ఈ సినిమాను తన హోమ్ బ్యానర్ లో నిర్మిస్తున్నాడు. నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి మరియు సోదరి నిఖిత రెడ్డిలు సంయుక్తంగా ఈ సినిమాను శ్రేష్ఠ్ మీడియా బ్యానర్ లో నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సమ్మర్ కు మాచర్ల నియోజకవర్గం సినిమా విడుదల అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# స్లీవ్ లెస్ ఫ్రాక్ లో రాశీ ప్లెజెంట్ లుక్ వైరల్


హిందీ మూవీ 'మద్రాస్ కేఫ్'తో కెరీర్ ని ప్రారంభించింది రాశీ ఖన్నా. జాన్ అబ్రహం సినిమాతో ఎంట్రీ ఇచ్చినా ఇప్పటికీ ఆశించిన స్థాయి గుర్తింపు లభించలేదు. 'మనం' సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చినా రాశి హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకుల ముందుకొంచ్చింది మాత్రం 'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో. జోరు



మూవీతో టాలీవుడ్ లో తన జోరు చూపించాలనుకున్నా కుదరలేదు. తర్వాత గోపీచంద్ 'జిల్'లో గ్లామర్ షోతో జిగేల్మనిపించేసింది.స్టార్ హీరోల సరసన నటించి క్రేజీ హీరోయిన్ గా పేరు తెచ్చుకోవాలని ప్రయత్నించినా యువహీరోలే తనకు ఏకైక ఆప్షన్ గా మారారు. అనిల్ రావిపూడితో చేసిన 'సుప్రీమ్' సినిమా రాశీకి మంచి పేరుని తెచ్చిపెట్టింది. బెల్లం శ్రీదేవిగా గ్లామర్ని మాత్రమే కాదు కామెడీని కూడా పండించగలనని నిరూపించుకుని నవ్వించింది. కానీ ఆ స్థాయిలో మాత్రం అవకాశాల్ని దక్కించుకోలేకపోయింది. ఎన్టీఆర్ లాంటి బిగ్ స్టార్ పక్కన 'జై లవకుశ'లో నటించే అవకాశం లభించినా ఆ మూవీ మల్టీస్టారర్ కావడం తన పాత్రకు ప్రాధాన్యత లేకపోవడంతో రాశీకి పెద్దగా క్రేజ్ దక్కలేదు.'తొలిప్రేమ'- 'ప్రతి రోజు పండగే' లాంటి హిట్స్ తన ఖాతాలో వున్నా రాశీ వంక చూసిన స్టార్ హీరో లేరు. దీంతో తన దృష్టిని తమిళ ఇండస్ట్రీకి మళ్లించింది. అక్కడ వరుస చిత్రాల్లో నటిస్తూ యమ బిజీగా మారిపోయింది రాశి. తమిళ్ లో రాశీ జోరు చూసిన మన వాళ్లు మళ్లీ తెలుగులో అవకాశాలు ఇవ్వడం మొదలుపెట్టారు. గోపీచంద్ తో "పక్కా కమర్షియల్".. నాగచైతన్యతో 'థ్యాంక్యూ' చిత్రాల్లో నటిస్తోంది.తెలుగు- తమిళ- మలయాళ భాషల్లో ఇప్పుడు రాశీ చేతిలో ఎనిమిది చిత్రాలున్నాయి. అందులో రెండు చిత్రాలు పూర్తి కాగా మరో ఆరు చిత్రాలు అండర్ ప్రొడక్షన్ లో వున్నాయి. ఎక్కడున్నా రాశీ తెలుగు ప్రేక్షకుల్ని మాత్రం మర్చిపోవడం లేదు. ఎప్పటికప్పుడు వారిని ఎంటర్ టైన్ చేయడానికి తన ఫొటోషూట్ లతో అలరిస్తూనే వుంది. తాజాగా స్లీవ్ లెస్ డ్రెస్ లో రాశీ పంచుకున్న ఫొటోలు అభిమానులతో పాటు నెటిజన్స్ని కట్టిపడేస్తున్నాయి. స్లీవ్ లెస్ గౌన్ లో తన ప్లెజెంట్ గ్లామ్ ని చూపిస్తూ రాశీ చేస్తున్న ఫొటోషూట్ లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఓరకంట చూస్తూ ఈ డ్రెస్ లో రాశీ చేస్తున్న రచ్చకు ఆమె ఫ్యాన్స్ చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే అని పాటేసుకుంటున్నారు.

# వాళ్లిద్దరి మధ్య ఆసక్తికర పోరు.. ఒకవేళ అదే జరిగితే

ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా టీమిండియా- పాకిస్తాన్ మధ్య జరిగే రసవత్తరమైన పోరు కోసం క్రీడాభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చాలా కాలం తర్వాత జరగనున్న దాయాది దేశాల మధ్య పోరు ఉత్కంఠను పెంచుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. అయితే, ఆ ఇంట్రస్టింగ్ మ్యాచ్ చూడాలంటే.. అక్టోబరు 24 వరకు ఆగాల్సిందే. యూఏఈ, ఒమన్ వేదికగా జరిగే మెగా టోర్నీలో భాగంగా దుబాయ్ జరిగే మ్యాచ్‌లో రెండు జట్లు తలపడనున్నాయి.ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ గౌతం గంభీర్ ఇప్పటికే తన ఫేవరెట్ జట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు పాకిస్తాన్ మాజీ కెప్టెన్ సల్మాన్ భట్ భారత్- పాక్ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా- పాక్ కెప్టెన్ బాబర్ ఆజం మధ్య ఆసక్తికర పోరు



జరుగనుందంటూ జోస్యం చెప్పాడు. ఈ మేరకు తన యూట్యూబ్ చానెల్ వేదికగా స్పందిస్తూ... " చాలా ఉత్కంఠగా ఉంది. కచ్చితంగా ఓ హోరాహోరీ పోరును చూడబోతున్నాం. బాట్స్‌మెన్ బాబర్, బౌలర్ బుమ్రా.. ఇద్దరూ టాప్‌క్లాస్ ప్లేయర్లే. అనుభవం ఉన్న ఆటగాళ్లే.అయితే, బాబర్ కంటే బుమ్రాకు అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆడిన అనుభవం ఎక్కువ. అయితే, ఓ కెప్టెన్‌గా బాబర్ ఆలోచనలు వేరుగా ఉంటాయి. వరల్డ్‌కప్ పోరులో ఇండియా- పాకిస్తాన్ మ్యాచ్‌లో బుమ్రా వర్సెస్ బాబర్ హాట్ ఫేవరెట్‌గా ఉండబోతోంది. వాళ్లిద్దరూ ముఖాముఖి తలపడే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. ఎందుకంటే.. బాబర్ ఓపెనర్‌గా వస్తే.. బుమ్రా తమ బౌలింగ్ అటాక్‌ను ఆరంభించే ఛాన్సులు ఎక్కువే.ఆటలోని అసలైన మజా అనుభవించగలిగే ఆరోజు ఏం జరగబోతుందో చూద్దాం" అని సల్మాన్ భట్ అభిప్రాయపడ్డాడు. అదే విధంగా తమ పేసర్లు మెరుగ్గా రాణిస్తే గెలిచే అవకాశాలు తమకే ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నాడు. షాహిన్ అఫ్రిది, హసన్ అలీ చెలరేగితే ప్రత్యర్థి జట్టుకు తిప్పలు తప్పవని పేర్కొన్నాడు. కాగా ఐసీసీ వన్డే వరల్డ్‌కప్-2019లో చివరిసారిగా ఇండియా- పాకిస్తాన్ పోటీపడగా.. కోహ్లి సేన 89 పరుగుల తేడా(డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం)తో ఘన విజయం సాధించింది.

# 'అఖండ' చివర్లో హడావుడి!

నందమూరి బాలకృష్ణ.. బోయపాటిల కాంబోలో రూపొందుతున్న అఖండ సినిమా ను దసరాకు విడుదల చేయాలని మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారు. సినిమా చిత్రీకరణ చివరి దశకు వచ్చింది. ప్రస్తుతం గోవాలో కీలక షెడ్యూల్ నడుస్తోంది. ఈ వారం చివరి వరకు గోవా షెడ్యూల్ ను ముగించి ఆ వెంటనే అన్నపూర్ణ స్టూడియోలో వేసిన ప్రత్యేక సెట్ లో చిత్రీకరణ జరుపబోతున్నారు. బోయపాటి శ్రీను మరియు బాలయ్యల కాంబోలో ఇప్పటికే వచ్చిన సింహా మరియు లెజెండ్ లు భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అఖండ సినిమా హ్యాట్రిక్ ను దక్కించుకుంటుంది అనే నమ్మకంను అంతా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ ముగింపు దశలో ఉన్న అఖండ సినిమాను దసరాకు విడుదల చేయాలని భావించినా కూడా విడుదల సాధ్యమా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.అఖండ సినిమా ను కరోనా కారణంగా మెల్లగా తెరకెక్కిస్తున్నారు. దసరాకు విడుదల చేయాలనుకుంటే స్పీడ్ గా చిత్రీకరణ ముగించాల్సి ఉంటుంది. ఈనెల చివరి వరకు షూటింగ్ ను ముగిస్తే తప్ప విడుదల సాధ్యం అయ్యే పరిస్థితి లేదు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**